www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -205 మంగళవారం 28 అక్టోబర్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# మొదలైన మొంథా

## ఏపీ తీరం వైపు 'మొంథా' తుపాను

## తీవ్రరూపం దాల్చే అవకాశం

పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షాలు

ప్రస్తుతం కాకినాడకు 570 కి.మీ దూరంలో కేంద్రీకృతం

తీరం వెంబడి గంటకు 110 కి.మీ వేగంతో గాలులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న విపత్తుల నిర్వహణ సంస్థ



అమరావతి, **అక్టోబర్27: ప్రజావినికిడి,** బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్ కోస్తా జిల్లాలపై ప్రారంభమైంది. తుపాను కారణంగా ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. తుపాను తీరానికి సమీపించే కొద్దీ దీని ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించిన తాజా వివరాల ప్రకారం, 'మొంథా' తుపాను గడిచిన 6 గంటల్లో గంటకు 18 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ప్రస్తుతం ఇది చెన్నైకి 520 కిలోమీటర్లు, కాకినాడకు 570 కిలోమీటర్లు, విశాఖపట్నంకు 600 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తుపాను మరింత బలపడి రేపు (మంగళవారం) ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో తీరం వెంబడి గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు.

మిగతా 2లో...



## ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉందాం

మొంథా తుపానుపై కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం చంద్రబాబు సమీక్ష

రియల్ టైంలో ప్రజలకు సమాచారం అందాలి

తుపాను బాధితులకు రూ.3 వేలు, 25 కిలోల బియ్యం: చంద్రబాబు ఆదేశాలు

# దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ

## త్వరలో ఎన్నికలు జరుగున్న రాష్ట్రాల్లో నిర్వహణ

## కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్




న్యూఢిల్లీ, **అక్టోబర్27: ప్రజావినికిడి,**

దేశవ్యాప్తంగా ఎన్నికల జాబితాలలో సవరణలను చేపట్టనున్నట్టు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. తొలిదశ బీహార్‌లో విజయవంతంగా ముగిసిందని మలిదశ త్వరలో ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో నిర్వహిస్తామని అన్నారు. సోమవారంనాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ వివరాలను సీఈసీ వెల్లడించారు. రెండో విడతలో 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలు ఉంటాయని చెప్పారు. వీటిలో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. వివిధ రాష్ట్రాల్లోని ఓటర్ల జాబితాను నవీకరించడం, ధృవీకరించడం,మిగతా 2లో...





## 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్...

### అన్ని రాష్ట్రాలకు నోటీసులు

2లో.

'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ

అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ

మోసాలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ వివరాలు సమర్పించాలని ఆదేశం

ఇది దేశవ్యాప్త కుంభకోణం.. దర్యాప్తు సీబీఐకి అప్పగించేందుకు మొగ్గు

ఈ మోసాల వెనుక మయన్మార్, థాయ్‌లాండ్ ముఠాలు ఉన్నాయని వెల్లడి

## అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలి

కాకినాడ వద్ద తీరం దాటనున్న మొంథా తుఫాన్

జిల్లా అధికారులతో పవన్ కళ్యాణ్ సమీక్ష



అమరావతి,**అక్టోబర్27: ప్రజావినికిడి,** మొంథా తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. మొంథా తుపాను కాకినాడ ప్రాంతంలో తీరం దాటనుందని తెలిపారు. ఈ క్రమంలో కాకినాడ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో పవన్ కల్యాణ్ తన క్యాంపు కార్యాలయంలో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పి. నారాయణ, స్పెషల్ ఆఫీసర్ కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఇతర అధికారులు హాజరయ్యారు.

మిగతా 2లో...

# రైతుకు నష్టం కలగొద్దు

## కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలి : సీఎం రేవంత్ రెడ్డి



కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలింపు

: ఉన్నతాధికారులకుమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశ

మొంథా తుపాన్ నేపథ్యంలో చర్యలు

ధాన్యం చెడిపోకుండా టార్పాలిన్‌ల వినియోగం

హైదరాబాద్, **అక్టోబర్27: ప్రజావినికిడి,** :రాష్ట్రంలో వర్ష సూచనల నేపథ్యంలో ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులకు నష్టం జరగకుండా కొనుగోళ్లు జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారుమిగతా 2లో...



## తదుపరిసిజెఐగా జస్టిస్ సూర్యకాంత్

### కేంద్రానికి సిఫార్సు చేసిన ప్రస్తుత సిజెఐ గవాయ్



న్యూఢిల్లీ, **అక్టోబర్27: ప్రజావినికిడి,**సుప్రీంకోర్టు కొత్త ప్రధాన నాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకం కానున్నారు. ఆయన పేరును సీజేఐ భూషణ్ రామకృష్ణ గవాయ్ కేంద్రానికి సిఫారసు చేశారు. జస్టిస్ సూర్యకాంత్ పేరును ఒక లేఖలో కేంద్ర న్యాయశాఖ మంత్రికి ఆయన తెలియజేశారు. గవాయ్ వారసుడి ఎన్నిక పక్రియనుమిగతా 2లో...

# ముగిసిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ

## 2,601 దుకాణాల కేటాయింపు

## వివిధ కారణాలతో 19 షాపుల డ్రా నిలిపివేత

## డిసెంబర్ 1నుంచి కొత్త దుకాణాలు

**హైదరాబాద్ అక్టోబర్27: ప్రజావినికిడి,**

మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిం ది. రాష్ట్రవ్యాప్తంగా 2,620 దుకాణాలకు వచ్చిన 95,137 దరఖాస్తులను 34 కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ల సమక్షంలో డ్రా తీసి 2,601 షాపులను కేటాయించారు. వివిధ కారణాలతో 19 దుకాణాల లాటరీ నిలిపివేశారు. మండలం, జిల్లా, మున్సిపాల్టీ, కార్పొరేషన్ పరిధిలో షాపులు దక్కించుకున్న వారు రెండ్రోజుల్లో నిర్దేశిత లైసెన్స్ ఫీజులో మొదటి విడుత చెల్లించి కన్ఫర్మేషన్ లెటర్ పొందాలని అధికారులు పేర్కొన్నారు.మిగతా 2లో...



# ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ -తెలంగాణ భవన్‌కు ఆటోడ్రైవర్ల ర్యాలీ

## ఆటోలో ప్రయాణించిన మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్ అక్టోబర్27: ప్రజావినికిడి,**

ఆటోడ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల నుంచి బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు ఆటో డ్రైవర్ల ర్యాలీ నిర్వహించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ఆటోలో కేటీఆర్ ప్రయాణించారు. మిగతా 2లో...



## ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?...

వీధి కుక్కల నియంత్రణపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

ఆదేశాలు పాటించని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు సమన్లు

పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలకు మినహాయింపు

నవంబర్ 3న కోర్టుకు హాజరు కావాలని ఆదేశం

దేశ ప్రతిష్ట దెబ్బతింటోందని ధర్మాసనం కీలక వ్యాఖ్య

హాజరు కాకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



2లో.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## తదుపరి సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ఇటీవల ప్రారంభించిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు సీనియర్ జడ్జిని సీజేఐ పదవికి ఎంపిక చేస్తారు. ప్రస్తుతం అత్యున్నత న్యాయస్థానంలో జస్టిస్ కాంత్ సీనియర్ మోస్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు. గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో దేశ 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపడతారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో ఉంటారు. హర్యానాలోని హిస్సార్‌లో 1962 ఫిబ్రవరి 10న జస్టిస్ సూర్యకాంత్ జన్మించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. 370వ అధికరణ రద్దు, భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, అవినీతి, పర్యావరణం, లింగ సమానత్వం వంటి కీలక తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో ఆయన ఉన్నారు. ఎన్నికల జవాబుదారీతనంపై తన నిబద్ధతను చాటుకుంటూ బిహార్ ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది వివరాలను వెల్లడించాలని ఇటీవల ఎన్నికల కమిషన్‌ను ఆయన ఆదేశించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌తో సహా బార్ అసోసియేషన్లలో మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వ్ చేయాలని చారిత్రక ఆదేశాలు సైతం ఇచ్చారు. 2022లో ప్రధాని నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటనలో భద్రతా లోపాలపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించిన ధర్మాసనంలో ఆయన కూడా ఉన్నారు. రక్షణ బలగాలకు ఓఆర్‌ఓపీ స్కీమ్‌ను సైతం ఆయన ధ్రువీకరించారు. పెగాసస్ స్పైవేర్ కేసును విచారించిన ధర్మాసనంలోనూ జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు.

## దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ

(మొదటి పేజీ తరువాయి)

అనర్హులైన ఓటర్లను తొలగించడం, నిజమైన ఓటర్లను మాత్రమే జాబితాలో ఉంచడానికి ఎన్నికల కమిషన్ ఈ పక్రియ చేపడుతోంది. ఎన్నికల జాబితా క్వాలిటీపై ప్రతి ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు లేవనెత్తుతున్నందున ఎస్ఐఆర్ పక్రియ చేపట్టడం అవసరమైందని సీఈసీ చెప్పారు. 1951 నుంచి 2004 వరకూ 8 సార్లు ఎస్ఐఆర్ నిర్వహించామని, చివరిసారిగా 21 ఏళ్ల క్రితం 2002-2004 మధ్య చేపట్టామని చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల బిహార్‌లో తొలి విడత ఎస్ఐఆర్ పూర్తి చేసినట్టు చెప్పారు. ఎస్ఐఆర్ ఫేజ్-2 షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకూ ప్రింటింగ్/ ట్రైనింగ్ ఉంటుంది. నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4 వరకూ హౌస్ టు హౌస్ ఎన్యూమరేషన్ ఫేజ్ ఉంటుంది. హియరింగ్/వెరిఫికేషన్ పక్రియ డిసెంబర్ 9 నుంచి 2026 జనవరి 31 వరకూ జరుగుతుంది. 2026 ఫిబ్రవరి 7న తుది ఎన్నికల జాబితా విడుదలవుపుంది.రెండో విడత ఎస్ఐఆర్ జరుగనున్న రాష్టాల్లో్ ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ , తమిళనాడు, గోవా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కేరళ, రాజస్థాన్ ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాల్లో అండమాన్ నికోబార్ ఐలాండ్స్, లక్షద్వీప్, పుదుచ్చేరి ఉన్నాయి.

# రైతుకు నష్టం కలగొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం ఆదేశాలతో సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొంథా తుపాను ప్రభావం తెలంగాణపై ఉండే అవకాశముండటంతో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులను పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. వానాకాలం ధాన్యంతో పాటు మొక్కజొన్న పంటలు దెబ్బతినకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు నష్టపోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని అందుబాటులో ఉన్న టార్పాలిన్‌లను వినియోగించి చెడిపోకుండా చూడాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించేందుకు అవసరమైన రవాణా వసతి ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాబోయే 30 నుంచి 45 రోజుల వరకు ధాన్యం కొనుగోళ్లలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని ఆదేశించారు. అకాల వర్షాలు సంభవిస్తున్న నేపథ్యంలో వరి కోతలు నిలిపేస్తే రైతులకు ఇబ్బంది ఉండదని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 8,342 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఇప్పటికే 4,428 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్టు తెలిపారు. మిగిలిన 3,814 కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలన్నారు.సోమవారం నాటికి 22,433 మంది రైతుల నుంచి 1,80,452 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. అందులో దొడ్డు రకం 73,628 మెట్రిక్ టన్నులు, సన్నాలు 1,06,824 మెట్రిక్ టన్నులున్నాయనీ, వాటి విలువ రూ.431.09 కోట్లు అని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ జరపాలనీ, కొనుగోలులో రైతులకు ఎక్కడా ఆటంకాలు కలుగకుండా చూడాలని అన్నారు. కేంద్రాలను ఎప్పటికప్పుడు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖాధికారులు సందర్శించి అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు.

## ముగిసిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ

(మొదటి పేజీ తరువాయి)

కొత్త షాపులు డిసెంబర్ ఒకటి నుంచి అందుబాటులోకి రానున్నాయని, 2027 నవంబర్ 30 వరకు రెండేండ్లు వీటి కాలపరిమితి ఉంటుందని తెలిపారు. 2023లో 1.32 లక్షల దరఖాస్తులు రాగా ఈసారి 37 వేలకుపైగా తగ్గాయి. దరఖాస్తు ఫీజును రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల వరకు పెంచడంతో పాటు పలు చోట్ల వ్యాపారులు సిండికేట్ కావడంతో తక్కువ అప్లికేషన్లు వచ్చినట్టు భావిస్తున్నారు. దరఖాస్తులు తగ్గినా ఫీజు పెంపుతో గతం కంటే రూ.200 కోట్ల వరకు అధికంగా ఆదాయం వచ్చింది. దరఖాస్తుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే మూడొంతులకు పైగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి దాని చుట్టు పక్కల ప్రాంతాల నుంచే రావడం గమనార్హం.వివిధ కారణాలతో నిలిచిపోయిన 19 మద్యం దుకాణాలకు డ్రా ను నవంబర్ 3న నిర్వహించనున్నట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు ఎక్సైజ్ శాఖ ఈనెల 28న నోటిఫికేషన్ విడుదల చేయనుంది. నవంబర్ ఒకటి వరకు ఐదు రోజుల పాటు దరఖాస్తులు స్వీకరిస్తారు. నిలిచిపోయిన వాటిలో ఆసిఫాబాద్ జిల్లాలో 7, ఆదిలాబాద్ జిల్లాలో 6, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2, శంషాబాద్ ఎక్సైజ్ జిల్లాలో 3, సంగారెడ్డి జిల్లాలో ఒక షాపు ఉన్నాయి.

## ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఎన్నికలకు ముందు ఆటోలో తీసుకెళ్లిన ఆటో డ్రైవర్ (అప్పుడు యజమాని) మస్రత్ అలీ ఆటోలోనే కేటీఆర్ ప్రయాణించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రయాణించిన ఆటో యజమాని రెండు ఆటోలను అమ్ముకుని డ్రైవర్ అయ్యారని తెలిపారు. కాంగ్రెస్ రెండేండ్ల పాలనలో ఆ ఆటో యజమాని రెండు ఆటోలను అమ్ముకునే పరిస్థితి తెచ్చారని విమర్శించారు. మస్రత్ అలీ పరిస్థితి అడిగి తెలుసుకున్న కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేసిన ద్రోహాన్ని ప్రతిపక్ష పార్టీగా ఎండగడుతామని హెచ్చరించారు. మరోవైపు గోకుల్ థియేటర్ నుంచి తెలంగాణ భవన్ చేరిన ర్యాలీని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు.కాంగ్రెస్ ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో లభించిన సబ్సిడీలు, బెనిఫిట్స్ అన్ని నిలిచిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు అండగా నిలిచే పార్టీ బీఆర్ఎస్ పార్టీయేనని తెలిపారు. ఈ ర్యాలీలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?...

## వీధి కుక్కల నియంత్రణపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

**న్యూఢిల్లీఅక్టోబర్27: ప్రజావినికిడి,**

వీధి కుక్కల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము జారీ చేసిన ఆదేశాలను పాటించడంలో విఫలమైనందుకు పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు (ప్రధాన కార్యదర్శులు) సమన్లు జారీ చేసింది. వారంతా నవంబర్ 3న తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని సోమవారం ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) రూల్స్, 2023 అమలుపై తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఈ ఏడాది ఆగస్టులోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, చాలా రాష్ట్రాలు పట్టించుకోకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "అధికారులు వార్తాపత్రికలు చదవడం లేదా? సోషల్ మీడియా చూడటం లేదా? ఆదేశాలు అందకపోయినా, అఫిడవిట్లు ఇక్కడ ఉండాల్సింది. నవంబర్ 3న చీఫ్ సెక్రటరీలందరూ తప్పనిసరిగా కోర్టులో హాజరు కావాలి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది.

పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశాయని కోర్టు గుర్తించింది. "దేశంలో వీధి కుక్కలకు సంబంధించిన ఘటనలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల విదేశాల దృష్టిలో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మేం కూడా వార్తా కథనాలను చదువుతున్నాం" అని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో, ఈ కేసులో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరుతూ వివిధ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు (%=ఔూ%), వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లపై కూడా కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. "దేశంలోని %=ఔూ%లన్నీ ఈ కేసులో పార్టీలుగా చేరతామంటే, మన ముందు కోట్లాది మంది ఉంటారు కదా? సహేతుకమైన సూచనలు చేయండి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

తదుపరి విచారణ తేదీన చీఫ్ సెక్రటరీలు హాజరు కాకపోతే, కఠిన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఢిల్లీ విషయంలో ఎంసీడీ ఇచ్చిన నివేదిక సరిపోదని, అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదో ఢిల్లీ చీఫ్ సెక్రటరీ వివరణ ఇవ్వాలని ఆదేశించింది.కాగా, ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల ప్రకారం, కుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలతో పాటు, వాటి కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ల వివరాలతో అన్ని రాష్ట్రాలు నివేదికలు సమర్పించాల్సి ఉంది. ఈ కేసు తదుపరి విచారణ నవంబర్ 3న జరగనుంది.

# 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్...

## అన్ని రాష్ట్రాలకు నోటీసులు

**న్యూఢిల్లీ, అక్టోబర్27: ప్రజావినికిడి,**

దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పోలీసులు, న్యాయాధికారులమంటూ నకిలీ కోర్టు పత్రాలతో పౌరులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న మోసాలపై దాఖలైన కేసును సుమోటోగా విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం, సోమవారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది.జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. ఈ తరహా మోసాలకు సంబంధించి తమ పరిధిలో నమోదైన ప్రథమ సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్) వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. "దేశవ్యాప్తంగా ఒకేరీతిలో దర్యాప్తు జరిగేలా చూసేందుకు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేస్తున్నాం" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసాలు కేవలం దేశవ్యాప్తంగానే కాకుండా, దేశ సరిహద్దులు దాటి కూడా జరుగుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ఈ కేసుల దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సూచించింది.

కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఇలాంటి అనేక కేసులను సీబీఐ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందని, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్ విభాగం సాంకేతిక సహకారం అందిస్తోందని కోర్టుకు తెలిపారు. అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి మాట్లాడుతూ, ఈ మోసాల వెనుక ఉన్న మనీలాండరింగ్ ముఠాలు భారత్ బయట నుంచి, ముఖ్యంగా మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాల నుంచి పనిచేస్తున్నాయని వివరించారు.

విచారణ సందర్భంగా, హర్యానా ప్రభుత్వం స్పందిస్తూ... అంబాలా సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలియజేసింది. సంబంధిత ఇతర ఎఫ్ఐఆర్‌ల వివరాలు సమర్పించేందుకు వారం రోజుల సమయం కోరగా, ధర్మాసనం అనుమతించింది.

ఈ క్రమంలో, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ పరిధిలో నమోదైన 'డిజిటల్ అరెస్ట్' సంబంధిత ఎఫ్ఐఆర్‌ల వివరాలను అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతానికి అధికారికంగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాల్సిన అవసరం లేదని, కేవలం కేసుల వివరాలను రికార్డుల రూపంలో అందించాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ నివేదికలు సమర్పించిన తర్వాత ఈ కేసుపై తదుపరి విచారణ జరగనుంది.

# మొదలైన మొంథా

(మొదటి పేజీ తరువాయి)

మొంథా తుఫాన్‌పై ఆందోళన వద్దని, అప్రమత్తంగా ఉందామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సోమవారం రాత్రి 10గంటలకు రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లో తుఫాన్ ప్రభావంపై వాతావరణ శాఖ అధికారులతో ఆయన సమీక్ష చేశారు. తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంపై మంగళవారం నుంచి అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ తెలపగా.. దీనిపై రియల్‌టైమ్‌లో ప్రజలకు సమాచారం అందించాలని సీఎం ఆదేశించారు. "ప్రభుత్వ సన్నాహాలు, సేవలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని, ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటూ పని చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తుఫాన్ సన్నద్ధతపై ఐవీఆర్ఎస్ విధానంలో సేకరించిన సమాచారంపైనా సీఎం సమీక్ష చేశారు. అంతకుముందు... ఇదే అంశంపై ఆయన అధికారులను అప్రమత్తం చేశారు. మంగళవారం ఉదయం నుంచి ప్రతి గంటకూ తుఫాన్ బులిటెన్లు విడుదల చేయాలని ఆదేశించారు. తుఫాన్ రక్షణ చర్యల విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగేందుకు అవకాశం ఉంటుందని, ఆ సమయంలో ప్రజలెవ్వరూ బయటకు రాకుండా అలర్ట్ చేయాలని చంద్రబాబు కోరారు. ఎప్పటికప్పుడు సంక్షిప్త సందేశాలు పంపి, అవగాహన పెంచాలని, తిత్లీ, హరికేన్, హుద్‌హుద్ తుఫాన్ల అనుభవాన్ని వినియోగించాలని సీఎం సూచించారు. 'రియల్ టైమ్‌లో నీటి ప్రవాహాలను పర్యవేక్షించాలి. వరద నీరు వెళ్లేందుకు వీలుగా డ్రెయిన్లలో బ్లాక్స్ లేకుండా పటిష్ఠం చేయాలి. చెరువులు, కాలువ గట్లు తెగిపోకుండా చూసుకోవాలి. సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా, శాటిలైట్ ఫోన్లు వినియోగించాలి. ప్రత్యేకంగా మొబైల్ టవర్లు ఏర్పాటు చేయాలి. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే 2,707 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. 110 మండలాల్లోని సచివాలయాల్లో 3,211 జనరేటర్లను బ్యాకప్ కోసం వినియోగించాలి. తుఫాన్ వల్ల ఎవ్వరూ ప్రమాదాల బారిన పడకూడదు.

ఒక్క మరణం కూడా సంభవించకూడదు. సముద్ర తీరంలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి" అని అధికారులకు చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం కృష్ణా జిల్లాలో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమగోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని తెలిపారు. ఎక్కువ వర్షపాతం కురిసే ప్రాంతాలను గుర్తించి, జిల్లా అధికారులు ముందస్తు రక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలతో పాటు అగ్నిమాపక సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సమీక్షలో మంత్రి లోకేష్, సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### తుఫాన్ బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం -సీఎం ఆదేశాలు

'మొంథా తుఫాన్ కార్యాచరణ భవిష్యత్‌లో వచ్చే తుఫాన్లను ఎదుర్కొనేందుకు ఒక మోడల్ కావాలి' అని సీఎం చంద్రబాబు నిర్దేశించారు. మొంథా తుఫాన్‌పై కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'విజయవాడ, మంగళగిరి, విశాఖ వంటి ప్రాంతాల్లో కొండచరియలు జారి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పునరావాస కేంద్రాల్లో బాధితులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి. మెడికల్ క్యాంపులు నిర్వహించాలి. పునరావాస కేంద్రాలకు ప్రత్యేకంగా ఇన్‌చార్జి అధికారుల ను నియమించాలి. పునరావాస కేంద్రాల నుంచి తిరిగి వెళ్లేటప్పుడు ఒక్కో కుటుంబానికి 25కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి. వలంటరీగా వచ్చే వారిని సహాయ కార్యక్రమాలకు వినియోగించుకోవాలి' అని సీఎం ఆదేశించారు.

### చంద్రబాబుకు ప్రధాని మోదీ ఫోన్

**మంత్రి లోకేశ్‌కు పీఎంవోతో సమన్వయ బాధ్యతలు**

మొంథా ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ప్రధాని నరేంద్రమోదీ తనకు ఫోన్ చేసి, అడిగి తెలుసుకున్నారని సీఎం చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రధానికి వివరించగా, కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా ఇచ్చారని చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా పీఎంవోతో సమన్వయం బాధ్యతను మంత్రి లోకేశ్‌కు సీఎం అప్పగించారు.

### సన్నద్ధతపై 83శాతం సంతృప్తి : అధికారులు

అధికారులు ఎన్ని రివ్యూలు చేశారనేది కాదని, క్షేత్రస్థాయిలో ఎంత మేర ప్రభావం చూపిందనేది ముఖ్యమని, దీనికి ప్రజాభిప్రాయాన్ని ప్రాతిపదకగా తీసుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు. తుఫాన్‌పై ప్రభుత్వ సన్నద్ధత ఎలా ఉందనే అంశంపై సేకరించిన ప్రజాభిప్రాయంలో 83న్ల సంతృప్తి వ్యక్తమైందని అధికారులు వివరించారు. తుఫాన్‌కు సంబంధించి జాగ్రత్తలపై మీమీ ప్రాంతాల్లో సమావేశాలు జరిగాయా అన్న ప్రశ్నకు 70శాతం మంది అవును.. అని సమాధానమిచ్చారని తెలిపారు. ముందు జాగ్రత్తలపై 74శాతం మంది సంతృప్తిగా ఉన్నారని అధికారులు వివరించారు. ప్రజలను అప్రమత్తం చేసే క్రమంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేసినట్లు ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో తొలిసారిగా ఈ సిస్టంను ఏర్పాటు చేశామని, రాష్ట్ర స్థాయిలో ఉన్న సమాచారం ఆధారంగా ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి నేరుగా ఆయా ప్రాంతాలకు మైక్‌ల ద్వారా అప్రమత్తం చేసే అవకాశం ఉందని తెలిపారు.

## అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలి



ఈ సమావేశంలో అధికారులకి పలు కీలక సూచనలు చేశారు డిప్యూటీ సీఎం. కాకినాడ జిల్లాలో 12 మండలాలపై మొంథా తుపాను ప్రభావం ఉంటుందని తెలిసిన క్రమంలో ముందస్తు చర్యలు పకడ్బందీగా ఉండాలని సూచించారు పవన్ కల్యాణ్. ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు వారికి అవసరమైన ఆహారం, రక్షిత తాగునీరు, పాలు, ఔషధాలు సమకూర్చుకోవాలని మార్గనిర్దేశర చేశారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు, గజ ఈతగాళ్లు సిద్ధంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ విషయాన్ని ప్రజలకి తెలియ జేయాలని సూచించారు పవన్ కల్యాణ్. ప్రజలు ఎలాంటి ఆందోళనకి గురికాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మొంథా తుపాను తీరం దాటే సమయంలో గాలుల తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశం ఉంటుందని తెలిపారు. తుపాను దృష్ట్యా విద్యుత్ స్తంభాలు ఒకవేళ పడిపోతే వాటి పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, రోగుల వివరాలు తెలుసుకొని.. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని దిశానిర్దేశర చేశారు. 24 గంటలూ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
మంగళవారం 28 అక్టోబర్ 2025

# చలో హైదరాబాద్.. నవంబర్ 1న
# దళితుల ఆత్మగౌరవ మహాయాత్ర..

**జస్టిస్ గవాయ్ పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి.. -ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ..**





**ప్రజావినికిడి, (శంషాబాద్):అక్టోబర్ 27,** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్.గవాయ్ పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయనందుకు నిరసనగా నవంబర్ 1న హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవ మహాయాత్ర' నిర్వహించనున్నట్టు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ తెలిపారు. శంషాబాద్ లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడారు.ఈ ప్రదర్శణ ప్రధాన ఉద్దేశ్యం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ పై జరిగిన దాడిపై కేసు నమోదు చేయించడమేనన్నారు.అదే సమ్మెలో దళితుల ఆత్మగౌరవాన్ని చాటడం, న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టడం, అదే సమ్మెలో దేశంలో ఉండే రాజ్యాంగాన్ని పరిరక్షడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.ఈ లక్షాలుగా నవంబర్ 1న ప్రదరణ మొదలు కాబోతుందన్నారు. నగరంలోని బషీరాబాద్లో ఉండే బాబు జగ్జీవన్ రాం విగ్రహం వద్ద ప్రదర్శణ మొదలై సెక్రటేరియట్లో ఉండే మహాత్మాగాంధీ పెద్ద విగ్రహం వరకు జరుగుతుందన్నారు. అప్పుడ దళితుల ఆత్మగౌరవ సభ నిర్వహించబడుతుందన్నారు.కులాలు మతాలు, రాజకీయాలకు అతీతంగా ఈ ప్రదర్శణ ఉంటుందన్నారు. దళితుల గౌరవాన్ని నిలబెట్టాలనుకున్న ప్రతి ఒక్కరు ఈ ప్రదర్శణ కు తరలిరావాలని అదే సమయంలో న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడాలనుకున్న ప్రతి ఒక్కరు ఈ ప్రదర్శణకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడ సుకోవాలన్న ప్రతి ఒక్కరు కులాలు, మతాలకు అతీతంగా ఈ సభకు తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు.సుప్రీం కోర్టు జడ్జి పై దాడి జరిగి 20 రోజులు గడిచిపోతున్నానింధితుడిపై కేసు నమోదు కాకపోవడం, నింధితుడిని అరెస్టు చేయడకపోవడం దాడిచేసిన వ్యక్తి వెనుక ఏ శక్తులు ఉన్నయో కనుకునే విషయ సమగ్రమైన విచారణకు దారి తీయకపోవడం ఈ దేశంలో దళిత వర్గాల నుంచి ఏ స్థాయికి ఎదిగినా దాడులు జరుగుతవని వ్యవస్థలన్ని ఏ చర్యలు తీసుకోవని ఇందుకు సాక్షంగా నిలబడ్డాయని ఆయన ఆవేధన వ్యక్తంచేశారు.దాడి జరిగి ఇరవై రోజులుదాటినా ఎందుకు చర్యలు తీసుకోలేదని,ఎందుకు నింధితుడిని అరెస్టు చేయలేదని మేము స్పష్టంగా ప్రశ్నిస్తున్నామన్నారు. దీని ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థ, పోలీసు డిపార్టుమెంటు జవాబు చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్. ఉపేందర్,ఆర్.బాబు మాదిగ,పీ.నర్సింహ్మా, కే. రమేష్,పీ. కృష్ణమాదిగ,వర్కింగ్ ప్రసిడెంట్ కే. శంకర్రావు,రత్నం,బీ, రవి, ఏ. కృష్ణ, రాంచందర్, నవీన్, గణేష్,సీహెచ్, బాస్కర్,ఆనందర్,బీ పాండు,సురేష్,ప్రవీన్, రాజు నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు విరాహత్ అలీ క్షమాపణ చెప్పాలి..

**తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి.. -టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్..**



**ప్రజావినికిడి,(హైదరాబాద్):** హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల ఫలితాల తర్వాత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయి సహచర జర్నలిస్టులను ఉద్దేశించి టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) తీవ్రంగా ఖండించింది.ఒక జర్నలిస్టు యూనియన్ కు అధ్యక్షుడుగా ఉండి తోటి జర్నలిస్టులను"విషసర్పాలని,బుడ్డర్ ఖాన్ లని,కొన్ని జర్నలిస్టు సంఘాలను బుడ్డ సంఘాలు అంటూ కించపర్చడం, దూషించడం, తూలనాడడం సరైంది కాదని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం,వల్లాల జగన్,బండి విజయకుమార్,రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు పేర్కొన్నారు. విషసర్పాలన్నీ ఏకమైనా తమను ఏమీ చేయలేక పోయాయంటూ సోషల్ మీడియాలో తెగ రెచ్చిపోయి పోస్టులు పెట్టడం జర్నలిస్టులను బాధించిందని అన్నారు.ప్రెస్ క్లబ్ ఎన్నికల సందర్భంగా గెలుపు లక్ష్యంగా అందరూ అవగాహనతో లేదా కూటమిగా ఏర్పడి పోటీ చేయడం సర్వసాధారణం. అలాంటి పరిస్థితుల్లో ప్యానెల్ లోపోటీ చేసినా,స్వతంత్రంగా పోటీ చేసినా గెలుపు ఓటములుసహజమని, అంతమాత్రాన ఓడిపోయిన జర్నలిస్టులను ఉద్దేశించి విరాహత్ అలీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సహించరానిదని వారన్నారు.విరాహత్ అలీ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని,సహచర జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వల్ల జర్నలిస్టులకు ఒరిగిందేమిటో, జర్నలిస్టుల సంక్షేమానికి ఏం చేశారో చెప్పకుండా ఎన్నికల పేరుతో ఒక వర్గం,ఒక యూనియన్ పెత్తనంతో క్లబ్ ను తమ కబంధహస్తాల్లో పెట్టుకొని ఆటాడుతున్నారని ధ్వజమెత్తారు.మంచి వాతావరణంలో జరగాల్సిన ప్రెస్ క్లబ్ ఎన్నికలను గందరగోళం చేసి లక్షల రూపాయలు ఖర్చు పెట్టి రాజకీయం చేయడం,సభ్యులను తప్పుదోవ పట్టించడం బాధాకరమని అన్నారు.నిన్న జరిగిన ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు,అదేవిధంగా ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికల్లో పోటీ చేసి గట్టి పోటీ ఇచ్చిన అభ్యర్థులకు వారు అభినందనలు తెలిపారు. గెలుపొందిన నూతన కార్యవర్గం రాబోయే రెండేళ్లలో ఏ ఒక్క రాజకీయ పార్టీకి, యూనియన్ లకు తలొగ్గకుండా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి,సభ్యుల సంక్షేమాని కృషి చేయాలని వారు కోరారు.

# కుటుంబ ఆరోగ్యం, విజయం, దీర్ఘాయువు కోసం చేసేదే ఛఠ్ పూజ..

**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్..**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**శివకేశవుల అత్యంత పవిత్ర మాసమైన కార్తీక మాసంలో శుద్ధ షష్టి రోజున సకల మానవాళికి ప్రత్యక్ష దైవమైన సూర్యభగవానుని ఆరాధిస్తూ కుటుంబ ఆరోగ్యము విజయము దీర్ఘాయువు కొరకు నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాలే ఈ ఛఠ్ పూజా కార్యక్రమాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. షాద్ నగర్ మున్సిపల్ పరిధిలోని 2వ వార్డ్ ఆఫీసర్స్ కాలనీలో ఉత్తర భారతీయులు ఘనంగా జరుపుకుంటున్న ఛఠ్ పూజా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరయ్యి అత్యంత నియమ నిష్ఠలతో,సంప్రదాయ బద్ధంగా జరుగుతున్న ఛఠ్ పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు.ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఘనంగా జరిగిన చట్ పూజ మహోత్సవాలలో పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు వంకాయల నారాయణరెడ్డి,ఈట గణేష్,ఫరూక్ నగర్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్,బీఆర్ఎస్ నాయకుడు వావిలాల సుజీవన్,మాజీ కౌన్సిలర్ చెట్ల పావని నర్సింహా,విక్రమ్ యాదవ్,సూరజ్ బల్లి,దినేష్,అషుతోష్, గుడ్డు యాదవ్,అమిత్,దిలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.పూజా కార్యక్రమాల అనంతరం మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ,మన ప్రాచీన పండుగల్లో ఒకటైన ఛఠ్ పూజా ప్రత్యక్ష దైవంగా భూమి మీద మనందరికీ మనుగడ కల్పిస్తున్న సూర్య భగవానుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఆయురారోగ్యాలను ఆనందాలను సుఖ సంతోషాలను ప్రసాదించమని చేసే ఒక గొప్ప పండుగని, అరణ్యవాస సమయంలో పాండవులు ద్రౌపది కూడా ఈ పూజలు చేసినట్లు మహాభారతంలో అనేక కథనాలు ఉన్నాయని, నాలుగు రోజులపాటు జరిగే ఈ పూజా కార్యక్రమాల్లో ఉపవాస దీక్షలతోపాటు,సూర్య భగవానునికి అర్ఘ్య మివ్వడం,ప్రత్యేక నైవేద్యాలు సమర్పించడం ద్వారా సూర్యుని అనుగ్రహం లభిస్తుందని విశ్వాసంతో అత్యంత నియమ నిష్ఠలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే ఈ పండుగ ప్రత్యక్ష దైవమైన ఆ సూర్యభగవాని ఆశీస్సులతో ప్రతి ఒక్క కుటుంబం, కుటుంబంలోని ప్రతి ఒక్కరికి మంచి ఆరోగ్యం,అద్భుతమైన విజయాలు కలగాలని, ప్రతి ఒక్కరికి ఆ భగవంతుడు దీర్ఘాయువును ప్రసాదించాలని అందరిలో భక్తి భావం పెరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

# గంజాయి సప్లై చేస్తున్న వ్యక్తులు అరెస్ట్



**ప్రజావినికిడి,(వాజేడు):**గంజాయిని తరలిస్తున్నారని వెంకటాపురం ఎస్సై కొప్పుల తిరుపతిరావు కి తగిన సమాచారం అందడంతో సిబ్బందితో నూగురు శివారు ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు.

ఈ క్రమంలో అతివేగంగా దూసుకొస్తున్న ఒక మూడు ద్విచక్ర వాహనాలను గమనించారు. మొదటగా బైక్ పై వచ్చిన వారిని ఆపి వివరాలు సేకరిస్తుండగా వెనక వస్తున్న బైకు మోటార్స్ సైకిల్ ను వెనకకు తిప్పి వేగం పెంచడంతో అదుపుతప్పి క్రింద పడ్డారు.వారి వద్ద ఉన్న బ్యాగును వదిలిపెట్టి పక్కనే ఉన్న పంట పొల నుంచి అడవిలోకి పారిపోయారు.వీరి వెనక వస్తున్న మరో బైక్ పై ఉన్న ఇద్దరు వ్యక్తులు కూడా వెనకకు తిరిగి పారిపోయారు. మొదటి అదుపులోకి తీసుకున్న ఇద్దరు వ్యక్తులను ప్రశ్నించగా వారి బ్యాగులో గంజాయి ఉందని మమ్మల్ని పట్టుకోవడం తోనే మిగతా వ్యక్తులు పారిపోయారని తెలిపారు.వీరంతా వెంకారాయ గ్రామం మణికొండ మండలం మల్కాజిగిరి జిల్లా ఒడిశా రాష్ట్రానికి చెందిన వారని తెలిపారు వీరు గంజాయిని ఆర్డర్లపై కేజీ ?4,000 కు సేకరించి భద్రాచలం మీదుగా వెంకటాపురం ములుగు నుంచి వరంగల్ వరకు కేజీ గంజాయిని పదివేలకు సరఫరా చేస్తుంటారని ఏటునాగారం ఏఎస్పి శివం ఉపాధ్యాయ తెలిపారు.ఈ కార్యక్రమం లో సివిల్ సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

# చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆరవ రోజు ఆకాశదీపం వెలిగించిన భక్తులు

**పూజలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ పులిమామిడి లతాశ్రీ శ్రీశైలం గౌడ్**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**పవిత్ర కార్తీకమాసం పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం దేవాలయ ఆవరణలో భక్తులు ఆకాశదీపం వెలిగించి ధ్వజస్తంభానికి వేలాడదీశారు.ఈ పూజ కార్యక్రమానికి మాజీ వార్డు కౌన్సిలర్ పులిమామిడి లతశ్రీ శ్రీశైలం గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరవు, రాఘవేంద్ర చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో దీపాలు వెలిగించి ఆకాశదీపం యొక్క విశిష్టతను తెలియజేశారు. ఆకాశదీపం వెలిగించినా,దీపానికి అవసరమైన నూనె, ఒత్తులు సమర్పించిన భక్తులపై భగవంతుని కృప ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ భజన మండలి సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీలను నమ్మించి మోసం చేసింది..

**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..**

**మైపేర్ ఫంక్షన్ హాల్ మైనార్టీ సెల్ సమావేశం..**

**పాల్గొన మాజీ మంత్రి మహమూద్ అలీ..ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..**






**ప్రజావినికిడి,(శంషా బాద్):**శంషాబాద్ లోని మైఫైర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మైనార్టీ సెల్ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ, ఎన్నికల ముందు మైనారిటీలకు ఈ కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను అమలు చేయచేయలేదని,గతంలో కెసిఆర్ మైనార్టీలకు అందించిన పథకాలను కూడా ఇవ్వకుండా మైనారిటీలను మోసం చేశారని,మళ్లీ రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మైనారిటీలకు అన్ని రకాల పథకాలను అమలు చేసుకుందామని భరోసా కల్పించారు.ఈ సమావేశంలో మాజీ హెూంమంత్రి మహమూద్ ఆలీ,ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు ఇబ్రహీం, షాద్ నగర్ మైనారిటీ నాయకులు గౌస్, జానీ,అడ్డు, పర్వేజ్,నిజాం మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో ఆదివాసీ ల సమవేశం



**ప్రజావినికిడి,(వాజేడు):**వాజేడు మండల కేంద్రం లో ఆదివాసీ జాక్ అధ్యక్షులు పూనెం శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ, ఏటునాగారం లో నవంబర్ 3న లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని ఐటిడిఎ,ముట్టడి చేస్తున్నామని వారన్నారు.ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు ఆదివాసి యువకులు మహిళలు ప్రతి గ్రామపంచాయతీ నుండి వేలాదిగా తరలి రావాలని వారు పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు తుడుం దెబ్బ నాయకులు అట్ట ఉపేందర్,దానసరి రాజేష్,ఎఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొరస నరసింహమూర్తి. భూమిపుత్ర రాష్ట్ర అధ్యక్షులు పూనె%శీ% రామచందర్,ఆదివాసి సంక్షేమ పరిషత్తు నాయకులు పరిష్క సతీష్,బోదబోయిన సురేష్,తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు పాయం జానకరావు వాసం నాగరాజు పీసా అధ్యక్షులు ఇండ్ల సమ్మయ్య వాజేడు మండల యువకులు తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ లో ముగిసిన మద్యం దుకాణాల లక్కీడ్రా ప్రక్రియ..






**ప్రజావినికిడి, (శంషాబాద్):అక్టోబర్ 27,**శంషాబాద్ లో మద్యం దుకాణాల డ్రా ప్రక్రియ ముగిసింది. మద్యం దుకాణాల లక్కీ డ్రా విధానంలో అధికారులు కేటాయించారు. శంషాబాద్ పట్టణంలోని మల్లిక కన్వెన్షన్ లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆదేశాల ముఖ్య ఆదేశాలఅతిథిగా హాజరై లక్కీ డ్రా తీసి షాపులను దరఖాస్తుదారులకు కేటాయించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2025-2027 సంవత్సరాలకు సంబంధించి జిల్లాలో మొత్తం 249 ఏ-4 మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి లాటరీ పద్ధతి ద్వారా పూర్తి పారదర్శకంగా కేటాయించారు. శంషాబాద్ యూనిట్ పరిధిలో మొత్తం 111 రిటైల్ మద్యం దుకాణాల ఎంపిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శంషాబాద్ ఎక్సైజ్ సూపరెంటెంట్ కృష్ణ ప్రియ మాట్లాడుతూ, శంషాబాద్ ఎక్సైజ్ పరిధిలో 111 గాను 108 మద్యం షాపుల డ్రా ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.ఎక్సైజ్ డ్రాలో వైన్ షాప్ తీసుకున్న వారికి పత్రాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. రేపటి లోపు వారు బ్యాంకు గ్యారంటీ మిగతా పత్రాలను సంబంధిత ఎక్సైజ్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.ఈ మద్యం దుకాణాలు రెండు సంవత్సరాల కాలపరిమితి ఉంటుందని ఆమె తెలిపారు.

# కాంగ్రెస్ గెలుపు ఖాయం

## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు వెంట రాగా.. కార్యకర్తలు కదం తొక్కగా..ప్రజలందరూ స్వాగతించగా. ఇంటింటి ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తనదైన శైలిలో కృషి మొదలుపెట్టారు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని బూత్ నెంబర్ 247 లో కార్పొరేటర్ విజయలక్ష్మితో కలిసి ఈ ప్రచార కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు.ఈ క్రమంలో షాద్ నగర్ నియోజకవర్గంలో నుంచి 100 మంది నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట నడిచారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వాళ్ళ కష్టసుఖాలు తెలుసుకొని కాంగ్రెస్ కు విజయం అందించాలని ఆయన ప్రజలను కోరారు.ఈ సందర్భంగా ఇస్త్రీ షాపుల్లో ఇస్త్రీ చేయడం,హొటల్ వద్ద టీ చేయడం లాంటి ఆటవిడుపు కార్యక్రమాలతో సరదాగా తన ప్రచారాన్ని కొనసాగించారు. ఆయన వెంటభారీ ఎత్తున కదిలిన కాంగ్రెస్ గణం నినాదాలు చేస్తూ ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు.ఏలాంటి విరామం లేకుండా ఉత్సాహంగా ఎమ్మెల్యే శంకర్ జూబ్లీహిల్స్ పురవీధుల గుండా తిరగడం విశేషం.

**కాంగ్రెస్ గెలుపు లాంచనమే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

ఎవరు ఎన్ని కుట్రలు చేసినా జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ విజయం లాంచనమేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.ఈ సందర్భంగా నాయకులు,కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బూతుల వారీగా నాయకులు చిత్తశుద్ధితో పనిచేసి పార్టీకి ఊపునివ్వాలని, గెలుపు వైపు నడిపించాలని సూచించారు. స్థానికంగా నేతలకు, కార్యకర్తలకు కొన్ని సమస్యలు ఉంటాయని వాటిని ఇటీవలనే ఇక్కడ ఇన్చార్జిలు అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని ఎలాంటి సమస్య ఉన్న పరిష్కరించడం జరుగుతుందని స్పష్టం చేశారు.కృష్ణానగర్ ప్రాంతానికి సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రచారం నిమిత్తం వస్తారని,ఈ విషయంపై సీఎంతో తాను స్వయంగా మాట్లాడుతానని అన్నారు. నాయకులు,కార్యకర్తలు ఇబ్బందులను అధిగమించి పార్టీ విజయం కోసం శ్రమించాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో,ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఎలాంటి సంక్షేమాలను చేపడుతుందో అక్కడివారికి చెప్పాలని తెలిపారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలకు సన్నాహాలు

## దేశవ్యాప్తంగా ఐక్యతా పాదయాత్రలు -యువతలో జాతీయ ఐక్యతా భావం పెంపొందించేలా కార్యక్రమాలు




**ప్రజావినికిడి,(రంగారెడ్డి):**సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలతో సమన్వయం చేస్తూ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.ఈ వేడుకలలో భాగంగా ప్రతి జిల్లాలో ఐక్యతా పాదయాత్రలు నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తెలిపారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా యువజన అధికారి ఐసయ్యతో కలిసి పాత్రికేయులతో ఆయన ప్రెస్ మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ,సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత ఏకతకు ప్రతీక. ఆయన ఆలోచనలను యువతలో నాటడం, దేశ నిర్మాణంలో వారిని భాగస్వామ్యం చేయడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యమని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి పేర్కొన్నారు.కేంద్ర యువజన వ్యవహారాలు,క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మేరా యువ భారత్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), జాతీయ కేడెట్ కార్ప్స్ (ఎన్ సిసి) శాఖల సమన్వయంతో దేశవ్యాప్తంగా ఐక్యతా పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అక్టోబర్ 31 నుంచి నవంబర్ 25 వరకు ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఈ యాత్రలు జరుగుతాయని,ప్రతి యాత్ర 8 నుండి 10 కిలోమీటర్ల దూరం వరకు సాగేలా ప్రణాళిక సిద్ధమైందని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు,అధికారులు,విద్యార్థులు, క్రీడాకారులు,సామాన్య ప్రజలు పాల్గొననున్నారు.వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా యువతను స్ఫూర్తి పరచడం ఈ పాదయాత్రల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. యువత %MyBharat.gov.in% వెబ్సైట్లో నమోదు చేసుకుని ఈ జాతీయ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 10 నుండి నవంబర్ 2 వరకు జాతీయ స్థాయిలో వ్యాసరచన, లఘు చిత్ర (20%-%30 సెకన్లు) అలాగే క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు.రాష్ట్ర స్థాయిలో ఎంపికైనవారిలో జాతీయ స్థాయికి ఎంపికైన 150 మందికి కేంద్ర యువజన వ్యవహారాలు,క్రీడా మంత్రితో కలిసి జాతీయ ఐక్యతా పాదయాత్రలో పాల్గొనే అవకాశం ఇవ్వనున్నారు. పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రం మై భారత్ కిట్ అందజేస్తారని చెప్పారు.ఈ సమావేశంలో జిల్లా యువజన అధికారి ఐసయ్య,జిల్లా పౌర సంబంధాల అధికారి పి.సి.వెంకటేశం,కమిటీ సభ్యులు మణిభూషణ్ చౌదరి, ఎన్.మల్లారెడ్డి,నరేష్ యాదవ్,గూడూర్ అవినాష్ రెడ్డి, ఆర్.కె.పురం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల కోసం రోడ్డెక్కిన గులాబీ దలం





**ప్రజావినికిడి,(వాజేడు):**వాజేడు నుండి భద్రాచలం వరకు రహదారులు నిర్మించాలంటూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని మొరుమూరు గ్రామపంచాయతీ లో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగ కాంతారావు పిలుపుమేరకు వాజేడు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెనుమల్ల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా పెనుమల్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ,గతంలో వాజేడు నుండి భద్రాచలం వెళ్లేందుకు రెండు మూడు గంటల సమయం పట్టేదని, అలాంటిది ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో భద్రాచలం వెళ్లాలంటే ఆరు ఏడు గంటలు సమయం పట్టే దుస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు.బిఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ లో చేరుతానని చెప్పి నేటికీ తట్టెడు మట్టి కూడా పొయ్యలేదు అభివృద్ధికి చెయ్యకుండా తన అభివృద్ధిపై దృష్టి పెట్టాడని ఆయన విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం శూన్యంగా మారిందన్నారు.తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఉన్న ఆ పార్టీ పెద్దలకు ఖాతాదారుగా పనిచేస్తున్నారు తప్ప తెలంగాణ ప్రజలకు ఆయన చేసిన మేలు ఏముందని విమర్శించారు.వాజేడు నుండి భద్రాచలం వరకు రహదారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టకపోతే బిఆర్ఎస్ పార్టీ తరఫున మరిన్ని ఉద్యమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం,ప్రజల ఇబ్బందుల కోసం ప్రశ్నిస్తే పోలీసులను పెట్టి ఈడ్చుకు వెళతారా,సీఎం డౌన్ డౌన్,సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.దర్న కార్యక్రమాన్ని వాజేడు పోలిసులు అడ్డుకోని ట్రాఫిక్ క్లియర్ చేసారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ముంపు కాలనీలకు శాశ్వత పరిష్కారం కోసం భారీ స్ట్రోమ్ వాటర్ డ్రైన్ నిర్మించాలి

## జలమండలి జిహెచ్ఎంసి అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి..



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ లో నీ ముంపు కాలనీలకు శాశ్వత పరిష్కారం చేయాలని బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి సోమవారం రోజు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని జలమండలి కార్యాలయంలో జలమండలి అలాగే జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ,కురిసిన భారీ వర్షాలతో వినూత్న కాలనీ,గాంధీ నగర్ సౌత్, అఖిలాండేశ్వరి కాలనీ, స్నేహమయి నగర్ కాలనీ,పివిఆర్ కాలనీ తదితర పరిసర కాలనీలో ముంపుకు గురవుతున్నాయని వాటికి శాశ్వత పరిష్కారం కోసం స్ట్రోమ్ వాటర్ డ్రైన్ నిర్మించుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని జిహెచ్ఎంసి అదేవిధంగాజలమండలి అధికారులు సమన్వయంతో సమస్య పరిష్కారం చేయాలని ఉన్నత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్య శాశ్వత పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సంబంధిత అధికారులతో తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జలమండలి జిఎం బలరాం రాజు, ఇంజనీరింగ్ విభాగం డి ఈ దామోదర్ రావు, జలమండలి డీజీఎం రాజగోపాల్, ఇంజనీరింగ్ ఏఈ కార్తీక్,జలమండలి మేనేజర్ సత్యనారాయణ, సిరివెన్నెల, తదితరులు ఉన్నారు.




# ఇందిరమ్మ రాజ్యంలో ఆటో డ్రైవర్ల బతుకు ఆగమైంది..

## ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..

## ఆటో డ్రైవర్ల సమస్య తెలుసుకునేందుకు ఆటోలో ప్రయాణం..



**ప్రజావినికిడి,(హైదరాబాద్):**

బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల సమస్యలు తెలుసుకొని వారి సమస్యలను ప్రభుత్వానికి తెలిసేలా చేయాలని ఉద్దేశంతో జూబ్లీహిల్స్ లోని సోమాజిగూడ డివిజన్ లో మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి,ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి,ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆటోలో ప్రయాణం చేసి ఆటో డ్రైవర్లను వారి యొక్క సమస్యలను అలాగే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యంలో ఆటో డ్రైవర్ల బతుకు ఆగమైందని కిస్తీలు కూడా కట్టలేని పరిస్థితుల్లో ఆటో డ్రైవర్ ఉన్నారని,ఇప్పటివరకు 161మంది ఆటో డ్రైవర్ల ఆత్మహత్య చేసుకున్నారని దీని కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని చనిపోయిన కుటుంబాలకు ఇకనైనా సాయం చేయాలని ప్రతి ఆటో డ్రైవర్ కి ఏడాదికి 12,000 ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని మరిచారని ఇప్పటికైనా రాష్ట్రంలో ఉన్న ఆటో డ్రైవర్ల అందరికీ కాంగ్రెస్ పార్టీ ఇస్తానన్న హామీలను అమలు చేసితీరాలని లేదంటే పెద్ద ఎత్తున రాష్ట్రం మొత్తం ఉద్యమిస్తామని తెలియజేశారు.

# నవంబర్ 19 నుండి 25 వరకు బంజారా స్వర్ణోత్సవాలు




**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):** నవంబర్ 19 నుండి 25 వరకు న్యూఢిల్లీలో ఢిల్లీ ఆవో బంజారా-బాజావో నంగారా' పేరుతో బంజారా భారత్ స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించబోతున్నామని ఈ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని అఖిల భారతీయ బంజారా మహా సేవా సంఘ్, బంజారా భారత్ ఫౌండర్,మాజీ ఎంపీ ధరావత్ రవీంద్ర నాయక్ కోరారు.ఈ మేరకు సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రవీంద్ర నాయక్ మాట్లాడుతూ, ఏడు రాష్ట్రాల్లో ఆదివాసీ గిరిజనులుగా,ఎస్సీలుగా,కొన్ని రాష్ట్రాల్లో ఓబీసీలుగా విభజించబడి విపరీత పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు.గత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ బంజారా సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించి, రిజర్వేషన్లను కల్పించారని గుర్తు చేశారు.వందలాది మంది బంజారాలు ప్రాణ త్యాగాలు చేసి హిందూ సమాజాన్ని కాపాడిన ఘనమైన చరిత్ర బంజారాలదని, ఆ సందర్భంలో రాయసీనహిల్స్, న్యూఢిల్లీలోని 359 ఎకరాలు,దేశంలోని అనేక రాష్ట్రాల్లోని ఆస్తులు,ఆభరణాలు అన్యక్రాంతమయ్యాయని,ఆయా భూములు,ఆస్తులను తిరిగి బంజారా సమాజాభివృద్ధికి తోడ్పడాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ్,బంజారా భారత్ రాష్ట్ర నాయకులు హనుమ నాయక్,ఎస్.పి.సోమ్లా దాదా,రామల బోనా నాయక్,జి.రవి నాయక్ రాథోడ్, బానోతు నవీన్ నాయక్,జ్యోతి భాయి, హేమా భాయి,మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్మారక దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

## సీనియర్ జర్నలిస్ట్ రాపోలు లింగస్వామి స్వచ్ఛందంగా రక్తదానం..

## ఏసీపీ సుబ్బారామిరెడ్డి చేతుల మీదుగా సర్టిఫికేట్ అందజేత..




**ప్రజావినికిడి,(సైదాబాద్):**

పోలీస్ స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకొని దక్షిణ తూర్పు మండలంలోని మలక్‌పేట్,సైదాబాద్ ఏసీపీ విభాగాల ఆధ్వర్యంలో సోమవారం సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎలైట్ కన్వెన్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది,యువత, పలువురు పాల్గొని రక్తదానం చేశారు. సమాజ సేవలో భాగంగా రక్తదానం చేయడం ద్వారా మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు.

### మానవత్వానికి ప్రతీక రక్తదానం

**-రాపోలు లింగస్వామి పిలుపు**

ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్, ఆర్‌టిఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు లింగస్వామి రెండవసారి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.ఆయనకు మలక్‌పేట్ ఏసీపీ సుబ్బారామిరెడ్డి స్వయంగా రక్తదాన సర్టిఫికేట్ అందజేశారు.ఈ సందర్భంగా,సీనియర్ జర్నలిస్ట్,ఆర్‌టిఐ కార్యకర్త రాపోలు లింగస్వామి మాట్లాడుతూ,రక్తదానం మానవత్వానికి ప్రతీక. మన రక్తం మరొక మనిషికి జీవం ఇస్తుంది.ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## వేముగంటి సంపత్ ఆధ్వర్యంలో
# వాల్ పోస్టర్ విడుదల..



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
బహుజన్ సమాజ్ పార్టీ ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షులు సంపత్ వేముగంటి ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ విడుదల చేసాము నవంబర్ 1 తారీకు నాడు ఇందిరాపార్కు వద్ద బీసీలకు విద్య ఉద్యోగ రాజకీయాలలో న్యాయపరంగా దక్కాల్సిన రిజర్వేషన్ ను 9వ షెడ్యూల్లో చేర్చి 42%శాతం రిజర్వేషన్ ఇవ్వాలి అని బీఎస్పీ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రం శేఖర్ ఆదేశాల మేరకు మద్దతు తెలుపుతున్న ధర్నా కార్యక్రమం సంబంధించిన వాల్ పోస్టర్ ఎల్బీనగర్ సర్కిల్లో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద విడుదల చేయడం జరిగింది.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎల్బీనగర్ ఇంచార్జ్ లు మంత్రి జగన్,గువ్వల సాయి రామకృష్ణ ముదిరాజ్,అధ్యక్షులు సంపత్ వేముగంటి, జనరల్ సెక్రెటరీ జన్ని శ్రీనివాస కురుమ, సెక్రటరీ మ్నెలకలపల్లి కుమార్,మేకల లక్ష్మణ్ ముదిరాజ్,క్యాతూరు ప్రేమ్ సాగర్,ఈర్ల కుమార్ ముదిరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికలలో విజయం ఖాయం..
### టీపీసీసీ అధ్యక్షులు -మహేష్ కుమార్ గౌడ్..





**ప్రజావినికిడి,(జూబ్లీహిల్స్):అక్టోబర్ 27,**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో టిపిసిసి ఆధ్వర్యంలో టూరిజం ప్లాజాలో సమీక్ష సమావేశం జరిగింది.మీనాక్షి నటరాజన్,టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్,జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో టీపీసీసీ ఆధ్వర్యంలో టూరిజం ప్లాజా లో జరిగిన సమీక్ష సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి,డివిజన్ లలో బాధ్యతలు చేపట్టిన మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,కార్పొరేషన్ చైర్మన్ లు బాధ్యతలు చేపట్టిన మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,కార్పొరేషన్ చైర్మన్ లు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, నాయకులందరూ సమిష్టి గా కృషి చేయాలనీ,అధిక మెజార్టీ సాధించాలనీ, అప్పగించిన బాధ్యతలుపకడ్బందీగా నిర్వహించాలని చిన్న నిర్లక్ష్యం కూడా వద్దన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవరు ఆపలేరు..
### -డాక్టర్ మల్లు రవి..



ప్రజావినికిడి,(జూబ్లీహిల్స్):
ప్రజల కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవరు ఆపలేరని పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి అన్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి ప్రణాళికలను గుర్తుగా చూసుకొని కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైనదని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో అత్యధిక శాతం విద్యావంతలు ఉన్నారని దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్న కోరికతో ప్రజలు ఉన్నారని జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ గెలిచి రాహుల్ గాంధీకి గిఫ్టుగా ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీలకు చైతన్ ఇవ్వాలన్న సంకల్పంతో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి సీఎం రేవంత్ రెడ్డి సాహోసోపేతంనిర్ణయాలు తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ మాట్లాడుతూ, నియోజకవర్గమే అభివృద్ధి దిశగా పైనుంచి ఎలా తాను సాయి శక్తుల కృషి చేస్తారని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఫిషరీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో
## భారస పార్టీ అభ్యర్థి సునితమ్మ గెలుపు తధ్యం

**:కొత్తపేట డివిజన్ భారస పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఇటికల యాదగిరి..**



**ప్రజావినికిడి,(జూబ్లీహిల్స్):**
జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ వెంగళ్‌రావు నగర్ పరిధిలో రహమత్ నగర్ నందు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి మాగంటి సునీత కు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న కొత్తపేట డివిజన్ భారస పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఇటికల యాదగిరి,ఈ ప్రచారంలో భాగంగా ప్రజలను కలుసుకుని అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు,అభివృద్ధి పథకాలు వివరించారు.అలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను,ప్రజలను మోసం చేస్తున్న విధానాన్ని ప్రజలకు వివరించారు.ప్రజల ఆదరణతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీమతి మాగంటి సునీత ని ఘన విజయంతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో భారస నాయకులు శ్యామ్ సుందర్,స్వాతి,కీర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు అండగా బీఆర్ఎస్ పార్టీ..
## అంబర్ పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్..



**ప్రజావినికిడి,(అంబర్ పేట్):**
రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సదుపాయం కల్పించిన నేపథ్యంలో, హైదరాబాదు నగరంలోని ఆటో డ్రైవర్లు తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటున్నారు.వారి సమస్యలను అర్థం చేసుకొని సంఘీభావంగా ఉండేందుకు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు పిలుపు మేరకు, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆయన సతీమణి శ్రీమతి కాలేరు పద్మ, అంబర్‌పేట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ ఆయన సతీమణి శ్రీమతి ఇ.స్రవంతి,అలాగే బాగ్ అంబర్‌పేట్ కార్పొరేటర్ శ్రీమతి పద్మ వెంకట్ రెడ్డి సోమవారం రోజు ఫీవర్ హాస్పిటల్ క్రాస్ రోడ్ నుండి బాగ్ అంబర్‌పేట్ రెడ్ బిల్డింగ్ వరకు కుటుంబ సమేతంగా ఆటోలో ప్రయాణం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ,ఆటో డ్రైవర్లు ఎవ్వరూ ఆత్మహత్యకు పాల్పడవద్దు. ఆటో డ్రైవర్లకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుంది అని తెలిపారు.
ప్రస్తుత ఉచిత బస్ సౌకర్యం కారణంగా ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు తీవ్రమైనవని ఆయన పేర్కొంటూ,ప్రభుత్వం తక్షణమే ఆటో డ్రైవర్లకు వాగ్దానం చేసిన ?12,000 ఆర్థిక సహాయం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
"ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఆటో డ్రైవర్లతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తాం" అని ఎమ్మెల్యే హెచ్చరించారు.

## బీహార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చాట్ పూజ కార్యక్రమం..







**ప్రజావినికిడి,(నాగోల్):**
సోమవారంరోజు నాగోల్ డివిజన్ పరిధిలోని నాగోల్ చెరువు ఆవరణలో "బీహార్ అసోసియేషన్" ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించిన ఛట్ పూజ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నాగోల్ డివిజన్ స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఉత్తర భారతీయ సోదర సోదరీమణులు ఆచరిస్తున్న ఛట్ పూజ దేశం యొక్క సమగ్ర సాంస్కృతిక ఐక్యతకు ప్రతీక అని అన్నారు.సూర్యుని ఆరాధించే ఈ పూజలో భక్తులు నది తీరాల వద్ద ఉపవాస దీక్షలు,పండ్ల నైవేద్యాలు సమర్పించడం ద్వారా కృతజ్ఞతలు తెలిపే పవిత్ర సంస్కారం ఉందని పేర్కొన్నారు.సూర్య దేవుడు, ఉషోదయ పూజ, అష్టమి పర్వదినాల విశిష్టతను గుర్తుచేస్తూ భక్తుల ఆరోగ్యం, సుఖశాంతి,కుటుంబ సుభిక్షత,రాష్ట్ర అభ్యున్నతి కోసం ప్రార్థించారు.
నాగోల్ డివిజన్ పరిధిలో నివసిస్తున్న ఉత్తర భారతి ప్రజలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు కావాల్సిన సహాయాన్ని అందిస్తామని స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ భరోసా ఇచ్చారు.తెలంగాణ అభివృద్ధిలో వారి పాత్ర ప్రశంసనీయం అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ డిఈ నీలిమ జవాన్ దర్శన్ బీహార్ అసోసియేషన్ అధ్యక్షులు అమ్రేష్ కుమార్ మౌర్య, రాము,అమర్ నాథ్, మౌర్య,దినేష్,బబ్లూ గుప్త,మోహిత్, మంటూ కేసరి, అభిషేక్ మౌర్య,సంఘ్ ప్రతినిధులు,పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ లను మోసం చేసిన కాంగ్రెస్

**బిజెపి స్కూళ్లో శిక్షణ పొందిన రేవంత్ -బిఆర్ఎస్ హయాంలోనే వారికి మేలు జరిగింది**

**మేమూ కొన్ని పొరపాట్లు చేసినా..మేలు చేశాం -బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి**







హైదరాబాద్, **అక్టోబర్27: ప్రజావినికిడి,**రాష్ట్రంలో మైనార్టీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ మైనారిటీలను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మైనార్టీల కోసం రూ.4 వేల కోట్ల బ్జడెట్ పెడతామని చెప్పి ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. తాము కూడా కొన్ని కొన్ని పొరపాట్లు చేసి ఉంటే చేసుండొచ్చు కానీ.. ఇండియాలో మైనార్టీలకు కేసీఆర్ చేసినన్ని పనులు ఇంకెవరూ చేయలేదని కొనియాడారు. హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మైనారిటీ నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ విషయాన్ని ఇతర రాష్ట్రాల్లో అసదుద్దీన్ ఒవైసీ కూడా చెప్పారు.. కానీ ఇక్కడ చెప్పరని విమర్శించారు. రాష్ట్రంలో నడుస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని.. ఇది కాంగ్రెస్-బీజేపీ కలిసి నడిపిస్తున్న ప్రభుత్వమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ ఎమ్మెల్యే కానీ, ఎమ్మెల్సీ కానీ లేరని అన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలోనైనా ఒక్క మైనార్టీ లీడర్‌ను కూడా ఎన్నుకోలేదని దుయ్యబట్టారు. షబ్బీర్ అలీ, అజారుద్దీన్ లాంటి వారు కూడా కాంగ్రెస్‌కు కనిపించట్లేదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఇచ్చినట్లే ఇచ్చి అజారుద్దీన్‌ను పక్కన పెట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రికెట్‌లో అజారుద్దీన్ కట్ షాట్‌లు కొడితే.. ఇక్కడ అజారుద్దీన్‌నే రేవంత్ రెడ్డి కట్ చేసేశారని ÷ర్ అయ్యారు. బుల్డోజర్ రాజ్యం నడవదని యూపీపై రాహుల్ గాంధీ విమర్శించారని.. ఇక్కడ అదే బుల్డోజర్ రాజ్యం నడుస్తుంటే రాహుల్ గాంధీ ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. హైడ్రా గురించి రాహుల్ గాంధీ సైలెంట్‌గా ఉంటారని విమర్శించారు. రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో పాటు మరో తొమ్మిది మంది ఎమ్మెల్యే పార్టీ మారారని మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను మీరు ఏ పార్టీలో ఉన్నారని వారిని అడగాలని.. వాళ్లు సమాధానం చెప్పలేరని విమర్శించారు. ఇదే విషయంపై కడియం శ్రీహరిని ప్రశ్నిస్తే.. 'ఎక్కడ ఉండాలో అక్కడే ఉన్నా' అని సమాధానం చెప్పారని.. ఇది వాళ్ల పరిస్థితి అంటూ ఎద్దేవా చేశారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలు మోదీ జేబు నింపే సంస్థలని రాహుల్ గాంధీ విమర్శిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగిస్తారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి బంధువుకు కేంద్రంలో కాంట్రాక్టులు వస్తాయని.. బదులుగా రేవంత్ రెడ్డి కూడా బీజేపీ నేతలకు లాభం చేకూరుస్తారని ఆరోపించారు. మోదీ తెచ్చిన చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాలకంటే తొందరగా ఇక్కడ రేవంత్ అమలు చేస్తారని విమర్శించారు. ఇది బడే భాయ్ కోసం రేవంత్ రెడ్డి చేసిన పని అంటూ ఎద్దేవా చేశారు. మహిళలకు ఫ్రీ బస్ అని చెప్పి పురుషులకు టికెట్ రేట్ డబుల్ చేశారని విమర్శించారు. కాంగ్రెస్ మాట తప్పిందని.. రెండేళు అయిపోయాయి.. ఇంకో మూడేళ్లలో కూడా వీళ్లు చేసేది ఏమీ ఉండదని కేటీఆర్ విమర్శించారు. శంషాబాద్‌లో బీఆర్ఎస్ మైనార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ షాదీ ముబారక్ వంటి పథకాన్ని ప్రవేశపెట్టారు.. షాదీ ముబారక్ కింద రూ.లక్ష ఇస్తే.. మేం అంతకంటే ఎక్కువ ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మైనార్టీలను కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌కుగా చూస్తోందని ఆరోపించారు. మైనార్టీ స్కూళ్లను కేసీఆర్ ప్రారంభించారని.. మైనార్టీ స్కూల్స్‌తో ఎంతో మంది విద్యార్థులు డాక్టర్లు అవుతున్నారన్నారు. నాలుగు ఉన్న మెడికల్ కాలేజీలు కేసీఆర్ 34కు పెంచారాని.. విద్యార్థులకు 20 లక్షల స్కాలర్‌షిప్ ఇచ్చారని.. పదేళ్లలో ఎన్నో పనులు చేశారన్నారు. మోదీ స్కూల్లో చదివానని.. చంద్రబాబు కాలేజీకి వెళ్లానని.. రాహుల్ దగ్గర ఉద్యోగం చేస్తున్నానని రేవంత్ బహిరంగంగానే చెబుతున్నారని.. చౌకీదార్ చోర్ అని రాహుల్ అంటే.. రేవంత్ రెడ్డి కాదు కాదు.. ఆయన నా పెద్దన్న అని చెబుతున్నాడన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలు మోదీ జేబు సంస్థలు అని విమర్శిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగిస్తారని.. ఒక సంవత్సరం క్రితం పొంగులేటి ఇంటిపై ఈడీకి రైడ్స్ అయ్యాయని.. ఒకటి కాదు రెండు రోజులు రైడ్స్ అయ్యాయని గుర్తు చేశారు. నోట్లు లెక్కపెట్టే మెషిన్‌లను లోపలికి తీసుకెళ్లిన దృశ్యాలు అంతా చూశారని. అంత జరిగిన తర్వాత ఏమైంది.. ఏమీ కాలేదు.. అంతా సైలెంట్ అంటూ విమర్శించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# లోకం చుడుతున్న వీరులు..

# ప్రకృతి అందాల చోరులు..

## విదేశీ యాత్రల్లో ఏటా షాద్ నగర్ న్యాయవాది రాజగోపాల్ మిత్రబృందం..



- ప్రస్తుతం డెన్మార్క్ తో పాటు పలు దేశాల్లో పర్యటన..
- ఇతర దేశాల్లో అభ్యున్నతికి కారణాలు పరిశీలించడమే లక్ష్యం..
- వాటికి సామాజిక మాధ్యం ద్వారా ప్రచారం..
- ప్రపంచ ప్రత్యేకతలను గుర్తించేందుకు ముందడుగు..
- దశాబ్దాలుగా యేటా విదేశీ యాత్రలో "దోస్తానా"..















**ప్రజావినికిడి,(షాద్ నగర్):అక్టోబర్ 27,**
పంచ పాండవులు లాంటి మిత్రులు.. ఒక్కొక్కరు ఒక్కొక్క చోట జీవనం..కానీ ఏడాది అయ్యిందంటే అందరూ ఒకచోట కలుస్తారు.. ప్రపంచంలోని ఇతర దేశాల వైపు కదులుతారు..అక్కడి ప్రత్యేకతలు చూస్తుంటారు..వాటిని ప్రచారంలోకి తెస్తుంటారు..లోకం చుట్టిన వీరులుగా.. ప్రపంచంలోని ప్రకృతి అందాన్ని అంతా దోచుకుంటున్న చోరులుగా కనిపించే ఈ మిత్రుల్లో ఈ విడత ఒక్క మిత్రుడు అనివార్య కారణాలవల్ల రాలేకపోయినప్పటికీ మిగిలిన నలుగురు మిత్రులు కలిసి విదేశీయాత్ర వైపు ముందుకు కదిలారు. డెన్మార్క్,నార్వే, స్వీడన్,ఫిన్లాండ్ తో పాటు పలు దేశాలలో పర్యటిస్తున్నారు. ఓవైపు ప్రకృతి అందాల పైన మక్కువ.. మరోవైపు ఇతర దేశాల ప్రత్యేకతలను తెలుసుకోవాలన్న ఆసక్తి దశాబ్దాల కాలంగా వీరిని ఇలా ముందుకు నడిపిస్తుంది.షాద్ నగర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది కంచి రాజగోపాల్ మిత్ర బృందం ప్రపంచ యాత్రల ఒరవడిని ఒక్కసారి వీరి యాత్రల వెనుక ఉన్న కారణాలు, ప్రత్యేకతలను పరిశీలించినట్లయితే..

### ఏ దేశమేగినా.. ఎందుకాలిడినా..

షాద్ నగర్ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కంచి రాజగోపాల్,శ్రీనివాస్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి, సునీత్ కుమార్ లతోపాటు మరో మిత్రులు తప్పకుండా ఉంటారు.అయితే ఈ పర్యటనకు మాత్రం ఒక్క మిత్రుడు రాలేదు.ప్రస్తుతం ఈ నలుగురు మిత్రులు విదేశీ పర్యటనలో బిజీగా ఉన్నారు.ఇది ఈ ఒక్క ఏడాదికే పరిమితం కాలేదు. ప్రతి ఏడాది వీళ్ళ యాత్రలు కొనసాగుతూనే ఉంటాయి.గతంలో కూడా దేశ విదేశాలలో వీళ్ళు పర్యటించారు. పోర్చుగల్,ప్యారిస్, స్పెయిన్,మొనాకో, ఫ్రాన్స్ వంటి దేశాలలో తిరిగారు. అంతకుముందు కూడా మరెన్నో దేశాలు చుట్టి వచ్చారు.దేశ విదేశాల్లో కొత్త కొత్త అంశాలను తెలుసుకోవడం వీరికి ఎంతో ఆసక్తి.ప్రస్తుత పర్యటనలో ఓడరేవులు,బోట్ రైడ్ వంటి సరదాలతో పాటు, ప్రపంచంలోని చర్చిలలో ప్రత్యేకమైన వాటిలో ఒకటైన హెల్సింకి చర్చి చూశారు.ఇది ఒక కొత్త పురాతనమైన వైవిధ్యమైన చర్చి.ఇక టల్లిన్
ఓల్డ్ సిటీతో పాటు కోపెన్హాగన్ లిటిల్ మైర్మెడ్ విగ్రహాన్ని పరిశీలించారు. 1913లో ఆవిష్కరించిన 100 సంవత్సరాల ప్రసిద్ధి చెందిన విగ్రహం ఇది. దీనిని పలుమార్లు కొందరు ధ్వంసం చేసిన అక్కడివాళ్లు మళ్ళీ దీనిని పునరుద్ధరించారు. మిలియన్ల లెక్కన ఏటా జనం ఈ విగ్రహాన్ని చూసేందుకు వస్తుంటారు.ఇలాంటి ప్రత్యేకత కలిగిన విగ్రహాలను పరిశీలించేందుకు మిత్రులు ప్రత్యేకంగా వెళ్లి రావడం విశేషం.

### ఎందుకీ యాత్రలు..?

విదేశీయాత్రలు అంటే కేవలం సరదా కోసం మాత్రమే కాదు.. అక్కడి దేశాలలో ఉండే ప్రత్యేకతలను తెలుసుకోవడం ద్వారా ఎంతో విజ్ఞానాన్ని పొందగలుగుతామని చెబుతున్నారు.ఈ మిత్ర బృందం. అంతేకాకుండా ఆయా దేశాలు అభివృద్ధి చెందడానికి గల కారణాలను అన్వేషించి ఆయా అంశాలపై సామాజిక స్పృహతో చైతన్యం తీసుకువచ్చేందుకు అవకాశం ఉంటుందని వెల్లడించారు.దీని ద్వారా స్నేహబంధాలు కూడా ఎప్పటికీ దృఢంగా ఉంటాయని వెల్లడించారు.ఇతర దేశాల ఔన్నత్యాలు, ప్రత్యేకతలు అధ్యయనం చేయడం ద్వారా ఎంతో నేర్చుకునే అవకాశం ఉంటుందని అదేవిధంగా వాటిని ఇతరులకు వివరించే అవకాశం ఉందని అంటున్నారు. జీవితకాలంలో ఈ ప్రపంచంలో ప్రతి మూలను చుట్టేయడమే తమ ముందున్న లక్ష్యం అని అంటున్నారు.అక్కడి అత్యున్నత అంశాలను,అద్భుత దృశ్యాలను సామాజిక మాధ్యమాల ద్వారా జనాల్లోకి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. స్నేహితులుగా వివిధ హోదాలలో ఉన్న ఈ మిత్రులు విదేశీ పర్యటన ద్వారా తమ కలలను సాకారం చేసుకోవడమే కాకుండా చైతన్య మార్గంలో అడుగు ముందుకు వేస్తుండడం విశేషం.హ్యాట్సాఫ్ మై డియర్ ఫ్రెండ్స్..ఆల్ ది బెస్ట్..

# మహిళా అధికారులకు మంత్రుల వేధింపులు

**వేధింపు మంత్రులను తొలగించండి**

**అర్థరాత్రిళ్లు పిలిపించుకోవడం ఏమిటి**

**కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డ కేంద్రమంత్రి బండి**



కరీంనగర్, **అక్టోబర్27: ప్రజావినికిడి,**
మహిళా అధికారులను కాంగ్రెస్ మంత్రులు వేధిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంటికి పిలిచి వార్నింగ్‌లు ఇస్తున్నారని విమర్శించారు. అర్థరాత్రి మహిళా అధికారులను ఇంటికి పిలిపించుకోవడం ఏమిటని ప్రశ్నల వర్షం కురిపించారు. అలాంటి మంత్రులను కేబినేట్ నుంచి వెంటనే తొలగించాలని అన్నారు. ఈ మేరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి ఘాటు వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే మహిళల నమ్మకం కోల్పోయిందని ఎద్దేవా చేశారు బండి సంజయ్ కుమార్. సోమవారం కరీనంగర్‌లో బండి సంజయ్ పర్యటించిన సందర్భంగా మీడియాతో కేంద్రమంత్రి మాట్లాడారు. మహిళా అధికారులపై కాంగ్రెస్ మంత్రుల వేధింపులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో పోలీసులకే రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా అధికారులని వేధింపులకి గురిచేసిన ఆ మంత్రులను వెంటనే బర్తరఫ్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ఆరోపించారు బండి సంజయ్ కుమార్. రౌడీషీటర్లు పోలీసులపై హత్యాయత్నం చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదా..? అని ప్రశ్నించారు. పట్టపగలు గోరక్షకులపై కాల్పులు జరిపితే ఏం చేస్తున్నారు..? అని నిలదీశారు. తప్పు చేసిన రౌడీషీటర్లకు ఎంఐఎం అండగా ఉంటే వారికే వత్తాసు పలుకుతారా..? అన్ని ÷ర్ అయ్యారు. ఒక వర్గం ఓట్ల కోసం ఎంఐఎం నేతల కాళ్లు పట్టుకునే దుస్థితిలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని ఎద్దేవా చేశారు. మహిళలు కాంగ్రెస్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని చెప్పుకొచ్చారు బండి సంజయ్ కుమార్. నెలకు రూ.2, 500లు, తులం బంగారం, స్కూటీపై కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ధ్వజమెత్తారు. యూపీ తరహాలో రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. రౌడీషీటర్లు బయటకు రావాలంటేనే గజగజ వణికేలా చేయాలని హెచ్చరించారు. సర్దార్ వల్లభాయిపటేల్ 150వ ఐక్యతా మార్చ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సర్దార్ వల్లభాయి పటేల్ చరిత్ర తెలుసుకోవాలని బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# కార్తీక సోమవారంతో శైవాలయాల్లో భక్తుల రద్దీ

**వేకువ జామునే పుణ్యస్నానాలతో ఆలయాలకు చేరిక -పాదగయ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు**



కాకినాడ, **అక్టోబర్27: ప్రజావినికిడి,**
కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా పంచారామ క్షేత్రాల్లో భక్తుల ర ద్దీ పెరిగింది. ఉదయం నుంచే పరమేశ్వరుడికి అభిషేకాలు జరిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తజనం పోటెత్తారు. తెల్లవారుజాము నుండి పాదగయ పుష్కరినిలో పవిత్ర స్నానమాచరించి.. కార్తీక దీపాలు వెలిగిస్తూ.. ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పాదగయ క్షేత్రంలో కార్తీక మాస మొదటి సోమవార వైభవం.. పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలోని పాదగయ క్షేత్రం, త్రిగయా క్షేత్రాల్లో ముఖ్యమైనదిగా ప్రసిద్ధి చెందిన పవిత్ర స్థలం. ఇక్కడి శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి ఆలయం, శ్రీ పురుహూతికా దేవి శక్తిపీఠంతో కలిసి ఉన్న ఈ పుణ్యక్షేత్రాన్ని అత్యంత పవిత్రమైన ప్రాంతంగా స్థానిక భక్తజనం నమ్ముతారు. ఈ ఆలయం శ్రీ గురు దత్తాత్రేయ స్వామి ప్రథమ అవతారమైన శ్రీపాద శ్రీవల్లభ మహారాజు జన్మభూమిగా కూడా ప్రసిద్ధి. పురాణాల ప్రకారం, గయాసురుడి యజ్ఞాన్ని కుక్కుట (కోడి) రూపంలో భంగం చేసిన శివుడు ఇక్కడ కుక్కుటేశ్వరుడిగా స్థిరపడ్డారని ప్రతీతి. తెల్లని లింగస్వరూపంలో దర్శనమిచ్చే స్వామివారు, పితృముక్తి కోసం భక్తులకు మొదటి గయాగా ప్రసిద్ధి చెందారు. కార్తీక మాసం మొదటి సోమవారంసందర్భంగా, ఈ పవిత్ర క్షేత్రం భక్తులతో అలరారుతోంది. తెల్లవారుజాము నుండే పాదగయ పుష్కరిణిలో పవిత్ర స్నానం చేసిన భక్తజనం, కార్తీక దీపాలు వెలిగించి స్వామివారికి ప్రత్యేక పూజలు అర్పిస్తున్నారు. ఈ కార్తీక మాసం శివకేశవులకు అత్యంత ప్రీతికరమైనదని పురాణాలు చెబుతున్నాయి. సూర్యోదయానికి ముందు నిద్రలేచి, నదీ స్నానం చేసి, మహామృత్యుంజయ మంత్రాలు జపించడం, ఆవునేతి లేదా నువ్వుల నూనెతో దీపారాధన చేయడం వంటి ఈ నియమాలు పాటించినవారు పుణ్యఫలం పొందుతారని పండితులు చెబుతున్నారు. పాదగయ పుష్కరిణి ప్రాంతంలో ఇప్పుడు దేవదీపాల జ్యోతి, 'హర మహాదేవ' గానాలు, భక్తుల భక్తిభావనలు కలిసి ఒక దైవిక వాతావరణం కనిపిస్తోంది.

# మగువల కన్నా మగవాళ్లలోనే వేగంగా మెదడు క్షీణత

**యూనివర్సిటీ ఆఫ్ ఓస్లో పరిశోధనలో వెలుగులోకి..**

**అక్టోబర్27: ప్రజావినికిడి,**
వృద్ధుల్లో మతిమరుపు సమస్య సాధారణమే.. వయసు పైబడిన కొద్దీ మెదడులోని కణజాలం నశించిపోవడమే ఇందుకు ప్రధాన కారణం. దీని వల్ల జ్ఞాపకశక్తికి సంబంధించిన సమస్యలు ఎదురవుతుంటాయి. అల్జీమర్స్, డిమెన్షియా వంటి వివిధ రకాల సమస్యలు చుట్టుముడతాయి. వృద్ధాప్యంలో మెదడు క్షీణిస్తుందని పరిశోధకులు గతంలోనే గుర్తించారు. అయితే, తాజా పరిశోధనలో సంచలన విషయాలు బయటపడ్డాయి. వృద్ధుల్లో మెదడు క్షీణత అనేది మహిళలకంటే మగవాళ్లలోనే వేగంగా జరుగుతోందని నార్వేకు చెందిన ఓస్లో యూనివర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. ఈ అధ్యయనం వివరాలను 'పీఎన్ఏఎస్' జర్నల్ ఇటీవల ప్రచురించింది.



**పరిశోధన సాగిందిలా..**

17 సంవత్సరాల నుంచి 95 సంవత్సరాల వయసున్న 4,726 మంది వాలంటీర్లను ఈ పరిశోధన కోసం ఎంచుకున్నట్లు ఓస్లో యూనివర్సిటీ పరిశోధకుడు ఆన్నే రవాండల్ తెలిపారు. మూడేండ్ల వ్యవధితో ప్రతీ ఒక్కరికీ రెండు సార్లు ఎంఆర్ఐ స్కాన్ లు చేయించామన్నారు. మొత్తంగా 12 వేల బ్రెయిన్ స్కాన్ లు తీసి వాటన్నింటినీ విశ్లేషించినట్లు తెలిపారు. ఇందులో మహిళల్లో కన్నా పురుషుల్లోనే మెదడు క్షీణత వేగంగా జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. పురుషుల మెదడులోనే కణజాలం వేగంగా క్షీణిస్తోందని వెల్లడైందని రవాండల్ వివరించారు.

**మహిళల్లోనే అల్జీమర్స్ బాధితులు ఎక్కువ**

వయసు పెరుగుతున్న కొద్దీ మనుషుల మెదడు వేగంగా క్షీణిస్తుంది.. ఇది పురుషుల్లోనే ఎక్కువని తాజాగా తేలింది. అయితే, మెదడు క్షీణత తక్కువగా ఉన్నప్పటికీ మహిళల్లోనే అల్జీమర్స్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని తమ పరిశోధనలో వెల్లడైందని రవాండల్ తెలిపారు. ఇది తమకు ఆశ్చర్యాన్ని కలిగించిందని ఆయన పేర్కొన్నారు. మనుషుల మెదడు క్షీణతపై లింగ ప్రభావం ఉంటుందనే దానిపై ఇప్పటివరకూ పెద్దగా సమాచారం లేదని ఆయన తెలిపారు. అయితే, మెదడు క్షీణతపై లింగ ప్రభావం అంశంపై మరింత లోతైన పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని రవాండల్ అభిప్రాయపడ్డారు.

# రుణాలిచ్చే 'మనీవ్యూ' యాప్ నుంచి రూ. 49 కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు



**అక్టోబర్27: ప్రజావినికిడి,**
రుణాలు మంజూరు చేసే యాప్ 'మనీవ్యూ'కు సైబర్ నేరగాళ్లు సుమారు రూ.49 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టారు. ఈ యాప్ యొక్క ఏపీఐ సిస్టంలోకి చొరబడిన హ్యాకర్లు కేవలం మూడు గంటల వ్యవధిలో దాదాపు రూ.49 కోట్లు కొల్లగొట్టారు. మనీవ్యూ యాప్, విజ్డమ్ ఫైనాన్స్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. ఈ యాప్‌ను దుబాయ్, చైనా, హాంకాంగ్, ఫిలిప్పీన్స్ దేశాలకు చెందిన సైబర్ హ్యాకర్లు లక్ష్యంగా చేసుకున్నారు.యాప్‌నకు చెందిన ఏపీఐ కీని ఉపయోగించి మూడు గంటల వ్యవధిలో రూ.49 కోట్లను కొట్టేసి, వాటిని 653 నకిలీ ఖాతాలలోకి బదిలీ చేశారని బెంగళూరు సైబర్ క్రైమ్ బ్రాంచ్ వెల్లడించింది. దుబాయ్‌లోని భారత సంతతికి చెందిన ఒక వ్యక్తి, బెళగావికి చెందిన ఇస్మాయిల్ అనే వ్యక్తి వద్ద నుంచి వర్చువల్ ప్రైవేటు సర్వర్‌ను కొనుగోలు చేసి ఈ సైబర్ దాడికి పాల్పడినట్లు సమాచారం.ఈ కేసులో ఇస్మాయిల్‌తో పాటు మహారాష్ట్రకు చెందిన మరొక వ్యక్తిని బెంగళూరు సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రకు చెందిన రెండో నిందితుడి పేరు మీద ఉన్న నకిలీ ఖాతాకు కూడా డబ్బు బదిలీ అయింది. ఇతర బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ అయిన రూ.10 కోట్లను పోలీసులు ఫ్రీజ్ చేశారు. ఈ కేసుకు సంబంధించి దుబాయ్‌లో ముగ్గురిని, హాంకాంగ్‌లో ఇద్దరిని అనుమానితులుగా గుర్తించారు. వారిని గుర్తించేందుకు బెంగళూరు సీసీబీ పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

# దిగివస్తున్న బంగారం ధరలు

**రూ. 1140 మేర తగ్గుదల నమోదు**

హైదరాబాద్, **అక్టోబర్27: ప్రజావినికిడి,** ఊహించినట్టుగానే సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే బంగారం ధరలు మరింతగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్‌లల్లో పసిడి ధరల తగ్గుదల, అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, డాలర్ బలపడుతుండటం వెరసి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో నేడు ట్రేడింగ్ మొదట్లో పసిడి ధరలు తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర గతంతో పోలిస్తే రూ. 1140 మేర తగ్గి రూ. 1,24,480కు చేరుకుంది. 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1050 మేర తగ్గి రూ.1,14,100 వద్ద తచ్చాడుతోంది. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి అంతర్జాతీయ మార్కెట్‌లల్లో కూడా పసిడి ధరలు తిరోగమనంలో పయనిస్తున్నాయి. ఔన్స్ బంగారం (24 క్యారెట్) స్పాట్ ధర రూ.0.7 శాతం మేర క్షీణించి 4,082.77 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర కూడా 1 శాతం మేర తగ్గి 4,095.80 డాలర్ల వద్ద కొనసాగుతోంది. నేటి ట్రేడింగ్ ముగిసే సమయానికి ధరలు మరింత తగ్గే ఛాన్సుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.అమెరికా, చైనా మధ్య సానుకూల వాతావరణంలో వాణిజ్య చర్చలు జరుగు తుండటంతో సురక్షిత పెట్టుబడి సాధనాలైన పసిడి, వెండికి డిమాండ్ తగ్గుతోందని నిపుణులు చెబుతున్నారు. ప్రామాణిక వడ్డీ రేట్ల కోత విషయంలో ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు తీసుకునే నిర్ణయం గురించి మార్కెట్ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం కాస్త నెమ్మదించంతో
కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్.. వడ్డీ రేట్లల్లో 25 బేసిస్ పాయింట్ల మేర కోత విధించే అవకాశం ఉంది. యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ జపాన్ మాత్రం వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించే అవకాశం ఉంది.

-------------

# డిజిటల్ అరెస్ట్‌లపై సుప్రీం ఆందోళన

**ప్రణాళిక రూపొందించాలని సిబిఐకి ఆదేశం**



న్యూఢిల్లీ,**అక్టోబర్27: ప్రజావినికిడి,**
డిజిటల్ అరెస్టులపై సిబిఐ దర్యాప్తుల జరగాల్సి ఉందన్న అభిప్రాయాన్ని సుప్రీం పేర్కొంది. వరుసగా జరుగుతోన్న సైబర్ నేరాల కారణంగా పలువురు ఆర్థికంగా దోపిడీకి గురవుతున్నారు. దేశవ్యాప్తంగా ఈ కేసుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ఇటీవల వచ్చిన ఓ కేసును సుమోటాగా తీసుకొని విచారణ జరుపుతోంది ఈ నేరాలపై సీబీఐ దర్యాప్తును పర్యవేక్షిస్తానని పేర్కొంది. డిజిటల్ అరెస్టు కారణంగా తాను రూ.కోటి కోల్పోయానని హరియాణాకు చెందిన ఓ వృద్ధ మహిళ వేసిన కేసు నేపథ్యంలో ఈ విచారణ జరుగుతోంది. ఈ సందర్భంగా సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. మయన్మార్, థాయ్‌లాండ్ వంటి ఆఫ్‌షోర్ లొకేషన్ల నుంచి ఇలాంటి కేసులు వెలుగు చూస్తున్నాయని, ఈ కేసుల దర్యాప్తునకు ఒక ప్రణాళికను రూపొందించాలని సీబీఐను ఆదేశించింది. కేంద్ర ఏజెన్సీ దర్యాప్తులో పురోగతిని పరిశీలిస్తామని, దానిని బట్టి అవసరమైన ఆదేశాలను జారీ చేస్తామని పేర్కొంది. అలాగే డిజిటల్ అరెస్టు కేసులకు సంబంధించి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నమోదైన ఎఫ్ఐఆర్ వివరాలను సమర్పించాలని ఆయా ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చింది.

-----------

# మొంథా తుఫాన్ ప్రభావం

**పలుచోట్ల కురుస్తున్న వర్షాలు**

**ఆయా జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు**

అమరావతి **అక్టోబర్27: ప్రజావినికిడి,)**మొంథా తుఫాన్ దూసుకొస్తున్న వేళ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలు జిల్లాల్లోని పాఠశాలలకు, కాలేజీలకు అధికారులు సెలవులు ప్రకటించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విశాఖ జిల్లాలో సోమవారం,మంగళవారం రెండు రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనకాపల్లి జిల్లాలో కూడా కలెక్టర్ విజయ కృష్ణన్ మూడు రోజులు సెలవులు ప్రకటించారు. మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల అన్ని విద్యాసంస్థలను మూసివేసినట్లు పేర్కొన్నారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా విద్యా సంస్థలను తెరిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ విజయ కృష్ణన్ హెచ్చరించారు. మరోవైపు.. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా నదులు, వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లు తున్నాయి. సోమశిల డ్యాంలో 70÷ుటఅలు, కండలేరు జలాశయంలో 60÷ుటఅలకు నీరు చేరుకుంది. వెయ్యి హెక్టార్లలో పంటలు నీటి మునిగాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో చేపల వేట, చేనేత పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి విపత్తులు ఎదురైనా సిద్ధంగా ఉండాలని అధికారులకి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల ఎప్పటికప్పుడు అలర్ట్ చేస్తున్నారు

# చిరంజీవి డీప్‌ఫేక్ కేసు

**దర్యాప్తు చేపట్టిన నగర పోలీసులు -త్వరలోనే ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేస్తాం**

**నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి**




హైదరాబాద్, **అక్టోబర్27: ప్రజావినికిడి,**మెగాస్టార్ చిరంజీవి ఫిర్యాదు చేసిన డీప్‌ఫేక్ కేసులో విచారణ చేస్తున్నట్లు నగర సీపీ సజ్జనార్ తెలిపారు. చిరంజీవి ఫొటోలను అశ్లీలంగా మార్ఫింగ్ చేసిన కేటుగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డీప్‌ఫేక్ కేసు విషయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. డీప్‌ఫేక్ మూలాల్లోకి వెళ్లి నిందితులను అరెస్ట్ చేస్తామని చెప్పారు. ఇలాంటి డీపీఫేక్ సెలబ్రిటీల కేసులు పెరిగే అవకాశం ఉందని అన్నారు. దీనిపై త్వరలోనే ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి విచారణ చేస్తామని ఆయన వెల్లడించారు. చాదర్‌ఘాట్ కాల్పుల కేసులో కూడా పురోగతి ఉందని స్పష్టం చేశారు. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. మెగాస్టార్ చిరంజీవి ఫొటోలను మార్ఫింగ్ చేసి అశ్లీల వీడియోలుగా మార్చి వెబ్‌సైట్లు, సోషల్ మీడియాలో దుండగులు పోస్ట్ చేశారు. దీంతో అవి వైరల్‌గా మారాయి. దీనిపై ఆయన వెంటనే సీపీ వీసీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం కోర్టును సైతం ఆశ్రయించటంతో న్యాయస్థానం ఆదేశాలతో సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తన పేరును దెబ్బతీసేలా డీప్‌ఫేక్ వీడియోలు రూపొందిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను మెగాస్టార్ చిరంజీవి కోరారు.

# మరోసారి బాలయ్య జోడీగా నయనతార?



నయనతారకి తెలుగు .. తమిళ .. మలయాళ భాషల్లో మంచి క్రేజ్ ఉంది. ఒక వైపున సీనియర్ హీరోల సరసన చేస్తూనే, మరో వైపున నాయిక ప్రధానమైన కథలను ఎంచుకుంటూ ముందుకు వెళుతోంది. నయనతార ఎంట్రీ ఇచ్చి 20 ఏళు దాటిపోయింది. అయినా ఆమెకి గల క్రేజ్.. మార్కెట్ తగ్గకపోగా పెరుగుతూ ఉండటం విశేషం. ఇప్పుడు కూడా ఆమె పెద్ద బ్యానర్లలో .. భారీ సినిమాలతో బిజీగా ఉన్నారు. తెలుగులో ఆమె చిరంజీవి సరసన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు ఒక రేంజ్ లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బాలకృష్ణతో నయనతార మరో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఒక టాక్ షికారు చేస్తోంది. బాలకృష్ణతో 'వీర సింహారెడ్డి' చేసిన గోపీచంద్ మలినేని, ఆయనతో ఇప్పుడు మరో సినిమా చేయడానికి సిద్ధమవుతున్నాడు. అందుకు సంబంధించిన సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సినిమాకి సంబంధించిన కథను, చిరంజీవి సినిమా సెట్లోనే గోపీచంద్ మలినేని ఆమెకి వినిపించాడని టాక్. కథ నచ్చడంతో నయనతార ఓకే చెప్పడం జరిగిపోయిందని అంటున్నారు. అదే నిజమైతే బాలకృష్ణ సరసన ఆమెకి ఇది నాలుగో సినిమా అవుతుంది. గతంలో వీళ్ల కాంబినేషన్లో వచ్చిన సింహా .. శ్రీరామరాజ్యం .. జై సింహా విజయాలను సాధించిన సంగతి తెలిసిందే.



# బాబీ కొల్లి చిరు కాంబినేషన్‌లో మెగా 158





మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం పలు భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ఆయన లైన్‌లో ఉన్న అత్యంత ఆసక్తికర చిత్రాల్లో ఒకటి దర్శకుడు బాబీ కొల్లి (కె.ఎస్. రవీంద్ర) దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం. చిరు జన్మదినం సందర్భంగా ఈ సినిమాను ప్రకటించడంతో మెగా ఫ్యాన్స్‌లో భారీ ఎ÷-జగైట్‌మెంట్ నెలకొంది. 'వాల్తేరు వీరయ్య' విజయానంతరం బాబీ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం మరో సూపర్ హిట్ అవుతుందనే నమ్మకం అభిమానుల్లో ఉంది. ఇప్పటికే విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్ 'బ్లడీ బెంచ్‌మార్క్ సెట్ చేసిన బ్లేడ్' అనే ట్యాగ్‌లైన్‌తో మెగా మాస్ హిస్టీరియాను పెంచింది. రక్తంతో తడిసిన చిలుక ఆకారం, గొడ్డలి డిజైన్ చూసి ఇది రస్టిక్ మాస్ యాక్షన్ డ్రామా అని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఇక ఈ సినిమాలో చిరంజీవితో పాటు మరో స్టార్ హీరో కూడా కీలక పాత్రలో నటించబోతున్నారని సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం, కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ ఈ సినిమాలో భాగమవుతున్నాడని తమిళ వర్గాలు పేర్కొన్నాయి. ఇది కేవలం గెస్ట్ రోల్ కాదు, ఫుల్ లెంగ్త్ పవర్‌ఫుల్ క్యారెక్టర్ అని టాక్. చిరు కార్తీ స్క్రీన్ షేర్ చేస్తారన్న ఈ వార్త మెగా ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ప్రస్తుతం ఈ మూవీ ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది. మలయాళ బ్యూటీ మాళవికా మోహనన్ హీరోయిన్‌గా నటిస్తారని వార్తలు వస్తున్నాయి. ఇక బాలీవుడ్ యాక్టర్-డైరెక్టర్ అనురాగ్ కశ్యప్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారని టాక్.సంగీతాన్ని ఎస్. థమన్ అందించనున్నారు. ఇటీవలే ఆయన ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని ధృవీకరించారు. 'మెగా 158' చిత్రాన్ని 2027 సంక్రాంతికి విడుదల చేసేలా షూటింగ్ షెడ్యూల్‌ను ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.త్వరలోనే ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, నటీనటుల జాబితా అధికారికంగా వెల్లడించనున్నట్లు చిత్ర బృందం తెలిపింది.




# బాహుబలిలో కొత్త సన్నివేశాలు

భారతీయ సినీ చరిత్రలో సరికొత్త రికార్డులు సృష్టించిన 'బాహుబలి' మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఒకే మూవీగా 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ సినిమా షూటింగ్ జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటూ.. పలు ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు. బాహుబలి' రెండు భాగాల్లోని కొన్ని సన్నివేశాలను కట్ చేసి 'బాహబలి: ది ఎపిక్'ను తీసుకొస్తున్నాం. ఎమోషన్ మిస్ కాకుండా ఉండేందుకు ఒక కొత్త సన్నివేశం యాడ్ చేశాం. కొత్తగా చిత్రీకరించిన సీన్ కాదు. అప్పుడు ఎడిటింగ్‌లో తీసేసిన సీన్ ఇప్పుడు ఉపయోగపడుతోంది. నేటి ట్రెండ్‌కు తగ్గట్టు కలర్ గ్రేడింగ్ మార్చాం అని అన్నారు. రాజమౌళి 'ఈగ' సినిమా తర్వాత బాహుబలి ఆలోచన చెప్పారు. ఇది విజువల్ వండర్ అని అప్పుడే నాకు అర్థమైంది. ఎలాంటి విజువల్స్ ఉంటే బాగుంటుందన్న కోణంలో కొంత రీసెర్చ్ చేశా. నిర్మాత శోభు యార్లగడ్డ, రాజమౌళిని ఒప్పించి మరీ ఈ సినిమాని డిజిటల్ కెమెరాలో షూట్ చేశా. ఈ సినిమా విషయంలో నేను తీసుకున్న కీలక నిర్ణయమదే. చాలా పెద్ద ప్రాజెక్టు కావడం అందుకే ఈ సినిమాని బయట షూట్ చేయకుండా రామోజీ ఫిల్మ్ సిటీలో చేశాబని తెలిపారు.

# గర్ల్‌ఫ్రెండ్‌లో గెస్ట్ రోల్‌ను తిరస్కరించిన వంగా



నేషనల్ క్రష్ రశ్మికా మందణ్ణ నటించిన హిందీ మూవీ 'థామా'వంద కోట్ల క్లబ్ లో చేరింది. మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ బ్యానర్ నుండి ఇటీవల కాలంలో వచ్చిన సూపర్ హిట్ చిత్రాల సరసన ఇది చేరకపోయినా... రశ్మిక అభిమానులు మాత్రం ఆమె పోషించిన బేతాళురాలి పాత్ర కొత్తగా ఉందని ఆనందిస్తున్నారు. ఇదిలా ఉంటే... రశ్మిక నటించిన మరో చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్' నవంబర్ 7న పాన్ ఇండియా స్థాయిలో జనం ముందుకు రాబోతోంది. దీన్ని అల్లు అరవింద్ సమర్పణలో నిర్మించారు. నటుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఓ కీలక పాత్రను చేయమని ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగను అడిగారట. ఈ విషయం గురించి దర్శకుడు రాహుల్ ఇటీవల మాట్లాడుతూ, 'ఈ సినిమాలో అతిథి పాత్రను మించిన ఓ కీలకమైన పాత్ర ఒకటి ఉంది. అది సందీప్ రెడ్డి వంగ చేస్తే కొత్తగా ఉంటుందనిపించింది. ఆయనలో మంచి నటుడు కూడా ఉన్నాడని నా నమ్మకం. అదే ధైర్యంతో ఆయన్ని అప్రోచ్ అయ్యాను. అయితే సందీప్ ఈ ఆఫర్ ను సున్నితంగా తిరస్కరించాడట. అతిథి పాత్రలో సరదాగా ఒకటి రెండు సీన్స్ అంటే ఓకే కానీ... నాలుగైదు సీన్స్ చేయడం కష్టమే' అని చెప్పేశాడట. దాంతో రాహుల్ రవీంద్రన్ ఆ పాత్ర చేయమని ప్రముఖ నటుడు 'వెన్నెల' కిశోర్ ను కోరాడట. ఎందుకంటే... 'వెన్నెల' కిశోర్, రాహుల్ రవీంద్రన్ మధ్య మంచి స్నేహం ఉంది. మాములూ గా అయితే రాహుల్ రవీంద్రన్ మాటను 'వెన్నెల' కిశోర్ ఎప్పుడూ కాదని చెప్పడు. కానీ ఆ పాత్రకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని, కమెడియన్ ఇమేజ్ ఉన్న తాను అలాంటి సీరియస్ పాత్ర చేస్తే జనం యాక్సెప్ట్ చేయరని కిశోర్ స్పష్టం చేశాడట. దాంతో ఇక గత్యంతరం లేక తానే ఆ పాత్రను చేశానని రాహుల్ తెలిపాడు. ఇటీవల వచ్చిన 'ది గర్ల్ ఫ్రెండ్' ట్రైలర్ లో రాహుల్ రవీంద్రన్ కనిపించాడు. నిజానికి తాను మల్టిపుల్ టాస్క్స్ చేయలేనని, అందుకే దర్శకత్వం, నటన ఒకేసారి చేయడం ఇష్టముండేది కాదని రాహుల్ రవీంద్రన్ తెలిపాడు. తాను గతంలో దర్శకత్వం వహించిన 'చి.లా.సౌ.', 'మన్మథుడు -2' చిత్రాలలో అందుకే నటించలేదని తెలిపాడు. కానీ ఈ సినిమాలో మాత్రం ఆ పాత్ర చేయకతప్పలేదని అన్నాడు. నిజానికి రాహుల్ ఫస్ట్ ఛాయిస్ అయిన సందీప్ రెడ్డి వంగా ఈ పాత్రను చేసి ఉంటే... సినిమాకు ఖచ్చితంగా ప్లస్ అయ్యి ఉండేది. ఎందుకంటే... 'పుష్ప' సినిమా తర్వాత హిందీలో రష్మికా మందణ్ణకు మళ్ళీ ఆ రేంజ్ హిట్ ఇచ్చిన సినిమా 'యానిమల్'. దాని దర్శకుడు సందీప్ రెడ్డి వంగ, రశ్మిక స్క్రీన్ షేర్ చేసుకుని ఉంటే... ఖచ్చితంగా అది ఉత్తరాది ఆడియెన్స్ లోనూ క్యూరియాసిటీ క్రియేట్ చేసి ఉండేది.

# డ్యాన్స్‌తో అదరగొట్టిన ప్రభాస్ 'ఫౌజీ' హీరోయిన్..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. వాటిలో 'సీతా రామం' ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వంలో రాబోతున్న 'ఫౌజీ' సినిమా ఒకటి. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి అనే కొత్త నటి హీరోయిన్‌గా ఎంపికైంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఒక డ్యాన్స్ వీడియో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ వీడియోలో ఇమాన్వి.. క్లాసికల్, మోడ్రన్ స్టెప్పులను కలిపి చేసిన డ్యాన్స్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. కేవలం కొన్ని గంటల్లోనే లక్షల వ్యూస్ సాధించిన ఈ వీడియోపై ప్రశంసల వర్షం కురుస్తోంది. కామెంట్స్ సెక్షన్‌లో 'ప్రభాస్ జోడీకి పర్ఫెక్ట్ ఛాయిస్' అని, 'నెక్స్ట్ సీతారామం గర్ల్' అని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు.'సీతా రామం' వంటి క్లాసిక్ చిత్రంతో బ్లాక్‌బస్టర్ అందుకున్న హను రాఘవపూడి, ఆ సినిమా ద్వారా మృణాల్ ఠాకూర్‌ను తెలుగు తెరకు పరిచయం చేశారు. ఇప్పుడు 'ఫౌజీ' కోసం ఇమాన్విని ఎంపిక చేశారు. అయితే, ఈ ఆఫర్ రావడానికి ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన డ్యాన్స్ వీడియోలే కీలక పాత్ర పోషించాయని ఫిల్మ్‌నగర్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. శాస్త్రీయ నృత్యంలో ప్రావీణ్యం ఉన్న ఇమాన్వి, గతంలో పలు స్టేజ్ షోలు కూడా చేసింది.సినిమా సెట్స్ మీదకు వెళ్లకముందే ఇమాన్వి తన డ్యాన్స్ ట్యాలెంట్‌తో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రభాస్ వంటి స్టార్ హీరో సరసన ఈ కొత్త టాలెంట్ ఎలా ఆకట్టుకుంటుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం అందరి దృష్టి ప్రభాస్-ఇమాన్వి జోడీ వెండితెరపై సృష్టించబోయే మ్యాజిక్‌పైనే నెలకొంది.



# అను ఇమ్మాన్యుయేల్ కు ఈసారైనా కలిసొస్తుందా?

ఒకప్పుడు టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో సందడి చేసిన మలయాళీ బ్యూటీ అను ఇమ్మాన్యుయేల్, సుమారు రెండేళ్ల విరామం తర్వాత మళ్లీ తెలుగు తెరపై కనిపించనుంది. రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రంలో అను ఒక కీలక పాత్ర పోషిస్తోంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించడంతో ఆమె రీఎంట్రీపై ఆసక్తి మొదలైంది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.
తెలుగులో దాదాపు పది సినిమాల్లో నటించిన అను ఇమ్మాన్యుయేల్‌కు 'మజ్ను' మినహా చెప్పుకోదగ్గ విజయం లభించలేదు. పవన్ కల్యాణ్, అల్లు అర్జున్, రవితేజ, నాని, నాగచైతన్య వంటి అగ్ర హీరోల సరసన నటించినప్పటికీ, ఆమెకు హిట్లు మాత్రం దక్కలేదు. దీంతో ఆమెపై 'ఐరన్ లెగ్' అనే ముద్ర పడింది. చివరిగా రవితేజ 'రావణాసుర' చిత్రంలో కనిపించిన ఆమె, ఆ తర్వాత తెలుగులో మరో సినిమా అంగీకరించలేదు. కేవలం తెలుగులోనే కాకుండా, తమిళంలోనూ 'జపాన్' సినిమా తర్వాత ఆమె ఏ ప్రాజెక్టులోనూ కనిపించలేదు.అయితే ఇప్పుడు 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాలో 'దుర్గ' అనే బోల్డ్ క్యారెక్టర్‌తో ఆమె సర్‌ప్రైజ్ ఇవ్వబోతోంది. రష్మిక, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రంలో అను పాత్ర కథను మలుపు తిప్పేదిగా ఉంటుందని తెలుస్తోంది. హీరోయిన్‌గా అవకాశాలు తగ్గిన తరుణంలో, కనీసం ఈ కీలక పాత్రతోనైనా తిరిగి ఫామ్‌లోకి వచ్చి టాలీవుడ్‌లో బిజీ అవుతుందేమో చూడాలి.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613